www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి :1 | సంచిక : 354 | ఆదివారం | 2 జూన్ 2024




టొబాకో యాడ్‌లో నటించేందుకు

## పుష్ప నిరాకరణ

పదికోట్లు ఇస్తామని చెప్పినా నో అన్న బన్నీ

6 లో..



2 లో..

ముగిసిన మోడీ

## ధ్యానముద్ర

తిరువళ్లూరు విగ్రహం వద్ద నివాళి
ఢిల్లీకి తిరుగు ప్రయాణం



# అన్నివర్గాల పోరాటంతోనే తెలంగాణ సాకారం

గత పదేళ్లుగా నియంతృత్వ పాలన సాగింది

- ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛ లభించింది
- ఆవిర్భావ వేడుకలకు అందరికీ ఆహ్వానం
- కేసీఆర్‌కు ప్రత్యేకంగా ఆహ్వానం అందించాం
- పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ కోసం ఎన్నో వర్గాల ప్రజలు పోరాటం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. తెలంగాణ వచ్చాక పదేళ్లు నియంతృత్వం కొనసాగిందని విమర్శించారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పడిరదన్నారు. అమర వీరులను స్మరించుకుంటూ ఆవిర్భావ వేడుకలు జరుగుతాయని వివరించారు. రాజకీయాలకు అతీతంగా వేడుకలకు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోడీ ఎన్నోసార్లు తెలంగాణ ఏర్పాటును అవమానించారు. వేడుకలకు సోనియా గాంధీ వస్తారని ఆశిస్తున్నాం. గత ప్రభుత్వం తెలంగాణ వేడుకలకు కాంగ్రెస్ నేతలను ఆహ్వానించలేదు. రాష్ట్ర చిహ్నం రూపకల్పనలో భారాస ప్రభుత్వం ఎవరి అభిప్రాయాలు తీసుకోలేదని పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు తమకు గత పదేళ్లలో ఒక్క ఆహ్వాన పత్రిక రాలేదన్నారు. తాము మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా ఆహ్వానం పంపామన్నారు.

మిగతా 2 లో

## అమరుల త్యాగాలు స్మరించుకోవాలి

2 లో..

ఆవిర్భావం రోజు వారికి ఎంతో ప్రాముఖ్యం
ప్రజలకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు



# తిరోగమన దిశలో కాంగ్రెస్ పాలన

అభివృద్ధిని పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

తెలంగాణ ఆవిర్భావం కాంగ్రెస్ దయాభిక్ష కాదు

- తొలి, మలి దశల్లో పోరాడి సాధించిన ఘన చరిత్ర
- తెలంగాణ ఉద్యమాన్ని రక్తసిక్తం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది
- అందుకే మీరు నిర్వహించే ఉత్సవాల్లో మేం పాల్గొనం
- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ లేఖ

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణ అభివృద్ధి తిరోగమన దిశలో సాగిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించే తెలంగాణ దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో పాల్గనరాదని నిర్ణయించినట్లు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారాస అధినేత కేసీఆర్ 22 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పంపిన నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితం.. అమరుల త్యాగాల పర్యవసానం. కానీ, కాంగ్రెస్ దయాభిక్షగా మీరు చేస్తున్న ప్రచారాన్ని నిరసిస్తున్నాను.

మిగతా 2 లో

## బీఆర్ఎస్ క్యాండిల్ ర్యాలీ

గన్‌పార్క్ వద్ద ప్రారంభించిన కేసీఆర్



## భయం లేదు..

మళ్లీ బీజేపీదే అధికారం

- మోడీ ధ్యానంపై విపక్షాల విమర్శలు దారుణం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

2 లో..

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు దూరంగా సోనియా గాంధీ?

2 లో..

# మళ్లీ మోడీకే ప్రజల పట్టం



## మూడోసారి ప్రధానిగా మోడీ

- అన్ని ఎగ్జిట్ ఫలితాల్లో ఎన్‌డీఏకు మొగ్గు
- 400 సీట్ల సంఖ్యను చేరుకోదని వెల్లడి
- ఇండియా కూటమికి పెరిగిన బలం
- బలమైన ప్రతిపక్షంగా చేరకునే అవకాశం

**న్యూఢిల్లీ, జూన్ 1 :** మోడీ మూడోమారు ప్రధాని కావడం ఖాయమని ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. మరోమారు బిజెపి కూటిమిదే అధికారమని తేల్చింది. దాదాపు అన్ని సంస్థలు నంబర్ అటుఇటుగా ఎన్‌డిఎకు మరోమారు ప్రజలు పట్టం కట్టారని వెల్లడించాయి. అదే సందర్భంలో కాంగ్రెస్ గతం కన్నా భారీగా సీట్లను సంపాదించుకుంది. ఇండియా కూటమి కూడా గణనీయంగా సీట్లు సంపాదించి గట్టి ప్రతిపక్షంగా రాబోతోందని ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

మిగతా 2 లో



## లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- కౌంటింగ్ కేంద్రాల దగ్గర సీసీ కెమెరాలతో నిఘా
- కౌంటింగ్ కేంద్రాల వరకు నాలుగంచెల భద్రత
- ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదు
- లెక్కింపు కోసం పదివేల మంది సిబ్బంది వినియోగం
- మీడియా సమావేశంలో వివరాలు తెలిపిన వికాస్ రాజ్

3 లో..



తెలంగాణ చిహ్నంలో చార్మినార్ తొలగించాల్సిందే

- మేం ఇందుకు ఎప్పుడూ పోరాడుతూనే ఉంటాం
- బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్


2 లో..

## ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

3 లో..

ఏడు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్

- బెంగాల్‌లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు
- సీపీఎం, ఐఎస్ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ




## పిల్లల టాయ్స్.. లంచ్ బాక్సుల్లో డ్రగ్స్

అహ్మదాబాద్‌లో పట్టుకున్న పోలీసులు

**అహ్మదాబాద్, జూన్ 1 :** డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకు స్మగ్లర్లు వినూత్న రీతిలో ఆలోచిస్తున్నారు. డబ్బుల కోసం ఎంతటి సాహాసానికైనా వెనుకాడటం లేదు. అయితే.. ఈసారి స్మగర్లు చిన్న పిల్లల లంచ్ బాక్స్ లో డ్రగ్స్ ను సరఫరా చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ.. ఆ బాక్స్ కస్టమ్ అధికారుల కంటపడింది. అందులో ఏముందోనని తెరిచి చూడగా.. రూ. కోటి కంటే ఎక్కువ విలువ చేసే డ్రగ్స్ లభ్యమైంది. శనివారం

మిగతా 3 లో



## గ్రూప్-1 ప్రిలిమ్స్ హాల్ టిక్కెట్లు విడుదల

3 లో..



## కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై తీర్పు

- 5వ తేదీకి రిజర్వ్ చేయడంతో తప్పని నిరాశ
- నేడు తీహార్ జైలుకు వెళ్లక తప్పని పరిస్థితి

2 లో..



# తిరోగమన దిశలో కాంగ్రెస్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

1969 నుంచి ఐదు దశాబ్దాలు, భిన్నదశలలో, భిన్నమార్గాలలో ఉద్యమ ప్రస్థానం సాగింది. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ రక్తసిక్తం చేసిందనేది మీరు దాచేస్తే దాగని సత్యం. 1952 ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురు విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నది ఆదిగా.. కాంగ్రెస్ క్రూర చరిత్ర కొనసాగింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని భారాస, తెలంగాణ వాదుల అభిప్రాయంగా ఉందని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేడుకల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని వెల్లడించారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న కాంగ్రెస్ పోకడలను నిరసిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితమని, అమరుల త్యాగాల పర్యవసానమనీ కాకుండా.. కాంగ్రెస్ దయాభిక్షగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ భావ దారిద్ర్యాన్ని నిరసిస్తున్నానని చెప్పారు. ఇకనైనా వైఖరిని మార్చుకుని సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో 369 మంది ముక్కుపచ్చలారని యువకులను కాల్చి చంపిన కాంగ్రెస్ దమననీతికి సాక్ష్యమే గన్‌పార్క్ అమరవీరుల స్థూపమని కేసీఆర్ తెలిపారు. ఆ స్థూపాన్ని కూడా ఆవిష్కరించుకోనివ్వకుండా అడ్డుపడిన కాంగ్రెస్ కర్కశత్వం తెలంగాణ చరిత్ర పుటల్లో నిలబడిపోయిందని అన్నారు. మలిదశ ఉద్యమంలోనూ వందలాది మంది యువకుల ప్రాణాలను బలిగొన్న పాపం నిశ్చయంగా కాంగ్రెస్ పార్టీదే అని తెలిపారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని సరిదిద్దడానికి జరిగిన చారిత్రాత్మక ప్రయత్నమే టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం అని చెప్పారు. పార్లమెంటరీ రాజకీయ పంథాలో, శాంతియుత మార్గంలో తెలంగాణ సాధన లక్ష్యంగా టీఆర్ఎస్ ఏర్పడటం తెలంగాణ ఉద్యమంలో మేలుమలుపు అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపైనా ఆ లేఖలో కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జై తెలంగాణ అనే నినాదాన్ని పలకలేదని.. తెలంగాణ ప్రజలకు ప్రాణ సమానమైన జై తెలంగాణ నినాదాన్ని నోటినిండా పలకలేని మీ మానసిక వైకల్యాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారని తెలిపారు. ఇక ముందైనా తెలంగాణ వ్యతిరేక మానసికత నుంచి బయటపడి జై తెలంగాణ అని నినదించే వివేకాన్ని తెలంగాణ సమాజం మీ నుంచి కోరుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి అయ్యి ఆరు నెలలవుతున్నా ఇప్పటివరకు తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని సందర్శించకుండా, శ్రద్ధాంజలి ఘటించకుండా తెలంగాణ మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని అన్నారు. మీ ప్రవర్తనతో, మీ పార్టీ ప్రవర్తనతో కాంగ్రెస్ ఇప్పటికీ మారలేదు.. ఇక మారదు.. ఇక ముందు మారే అవకాశం లేదని స్పష్టమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతున్నది ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని.. బీఆర్ఎస్ పార్టీతో సహా ఉద్యమకారులు, తెలంగాణ వాదులు అభిప్రాయంగా ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న మీ వికృత పోకడలను నిరసిస్తూ.. మీరు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని తెలియజేయడానికి విచారిస్తున్నామని అన్నారు. ఇక ముందైనా ఇటువంటి వైఖరిని మానుకొని నిజమైన ప్రగతి కోసం, సంక్షేమం కోసం ప్రయత్నిస్తారని, ఎన్నికల వాగ్దానాలన్నీ త్వరగానే నెరవేరుస్తారనీ ప్రజల మన్ననలు పొందుతారని ఆశిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ క్యాండిల్ ర్యాలీ

## గన్‌పార్క్ వద్ద ప్రారంభించిన కేసీఆర్

**ఖైరతాబాద్, ప్రజానావ:** బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్యాండిల్ ర్యాలీని ప్రారంభించారు. గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ కొనసాగనుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జంట నగరాల పార్టీ శ్రేణులతో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని హాజరయ్యారు. ఇదిలావుంటే అంతకుముందు కేసీఆర్ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నారు. శనివారం సాయంత్రం లక్డీకపూల్ వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించింది. గన్‌పార్క్ దగ్గర తన కోసం వేచి చూస్తున్న పార్టీ నేతల వద్దకు బంజారాహిల్స్ నందీనగర్ నుంచి బయల్దేరి వెళ్లగా లక్డీకపూల్ ట్రాఫిక్‌లో ఆయన చిక్కుకున్నారు. దాదాపు అరగంటకు పైగా ఆయన ట్రాఫిక్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సావ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. 10 ఏళ్లుగా అధికార పార్టీ హోదాలో వేడుకలు నిర్వహించగా.. రాష్ట్రావిర్భావం తరువాత తొలిసారి ప్రతిపక్ష హోదాలో కార్యక్రమం జరుపుతోంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీలో కేసీఆర్ పాల్గొనసుండటంతో ఆ పార్టీ శ్రేణులు భారీగా గన్ పార్క్ వద్దకు చేరుకుంటున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ప్రజాప్రతినిధులు తదితర ముఖ్య నేతలు గన్ పార్క్ వద్దకు చేరుకున్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించను న్నారు. అనంతరం గన్ పార్క్ నుంచి సచివా లయం వద్ద ఉన్న అమరవీరుల స్మారక చిహ్నం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించ నున్నారు.

# కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై తీర్పు

- 5వతేదీకి రిజర్వ్ చేయడంతో తప్పని నిరాశ
- నేడు తీహార్ జైలుకు వెళ్లక తప్పని పరిస్థితి

**న్యూఢిల్లీ, జూన్ 1 :** సుప్రీంకో గత నెలలో మంజూరు చేసిన మధ్యంతర బెయిలును పొడిగించాలంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పెట్టుకున్న దరఖాస్తుపై తీర్పును ఢిల్లీ కోర్టు ఈనెల 5వ తేదీకి రిజర్వ్ చేసింది. దీంతో ఈనెల 2వ తేదీన తిరిగి తీహార్ జైలు అధికారుల ముందు కేజ్రీవాల్ లొంగిపోవడం అనివార్యం కానుంది. ఆరోగ్య కారణాలు, వైద్య పరీక్షల రీత్యా ముందస్తు బెయిలు గడువును పొడిగించాలంటూ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనతో విచారణ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విభేదించింది. తన ఆరోగ్యంపై ఆయన తప్పుడు ప్రకటనలు చేశారని కోర్టు దృష్టికి తెచ్చింది. తనను నిర్బంధంలోకి తీసుకున్నప్పటి నుంచి 6 కిలోల బరువు తగ్గానంటూ కేజ్రీవాల్ చేసిన నిజం లేదని పేర్కొంది. పైగా ఒక కిలో బరువు పెరిగారని తెలిపింది. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బదులు దేశవ్యాప్తంగా ఆయన పర్యటిస్తున్నారని కోర్టుకు విన్నవించింది. మధ్యంతర బెయిలును పొడిగించాలని కేజ్రీవాల్ కోరడంలో ఔచిత్యాన్ని కూడా ఈడీ ప్రశ్నించింది. మధ్యంతర బెయిల్‌ను పొడిగించమని కోర్టుకు హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదించారు.

# అన్నివర్గాల పోరాటంతోనే తెలంగాణ సాకారం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణకు ఒక గీతం ఉండాలని ప్రజలు మార్పుకోరుకున్నారని చెప్పారు. తెలంగాణ చిహ్నంపై గతంలో ఎవరి అభిప్రాయాలను తీసుకోలేదని.. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాజకీయంగా విమర్శలకు వేదిక కాదని చెప్పారు. ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర గీతం ఆవిష్కరిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వేడుకలు జరుపుకోవాలన్నారు. తెలంగాణ అమరులను ప్రధాని నరేంద్ర మోడీ అవమానించారని విమర్శించారు. తల్లిని చంపి బిడ్డను తెచ్చుకున్నారని హేళన చేశారన్నారు. సోనియా తెలంగాణ ఇచ్చిన ప్రదాత.. సోనియా వస్తారనే నమ్మకం ఉందన్నారు. జయ జయహే తెలంగాణ పాట తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేసే శక్తిగా అభివర్ణిం చారు మంత్రి జూపల్లి కృష్ణారావు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వందలాది బిడ్డలు ప్రాణాలు అర్పించారని చెప్పారు. గొప్ప తెలంగాణ ఏర్పడాలని అమరవీరులు కోరుకున్నారు. అమరవీరుల ఆకాంక్షలకు భిన్నంగా పాలన కొనసాగుతోందన్నారు.. బీజేపీ, బీఆర్ఎస్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రులు పొన్నం, జూపల్లి కృష్ణారావు తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలుపెరుగని పోరాటాలు, బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఈ సందర్భంగా వారు చేసిన సేవలను వారు గుర్తు చేశారు. మంత్రులు వెంట ఎమ్మెల్యే దానం నాగేందనర్ కూడా ఉన్నారు.



# అమరుల త్యాగాలు స్మరించుకోవాలి

- ఆవిర్భావం రోజు వారికి ఎంతో ప్రాముఖ్యం
- ప్రజలకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు

**హైదరాబాద్, ప్రజానావ:** ప్రత్యేక రాష్ట్రం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగాల్ని స్మరించుకునే ఆవిర్భావ దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి ఈ సందర్భంగా నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ సమానంగా అందినప్పుడే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు, సకల జనులకు, ప్రత్యేక రాష్ట్ర అకాంక్షను గౌరవించి మద్దతు తెలిపిన ప్రతీ ఒక్కరికీ, తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా గాంధీకి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తోందని అన్నారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న మహనీయుల ఆశయ సాధనకు' ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతున్నదని వివరించారు. యావత్ తెలంగాణ సమాజం మనోభావాలకు అనుగుణంగా, ప్రజా సంఘాలు, పౌర సంస్థలు, ఉద్యోగ సంఘాలతో సంప్రదిస్తూ... నూతన ఒరవడిని సృష్టించిందని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు.

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు దూరంగా సోనియా గాంధీ?

**న్యూఢిల్లీ, జూన్ 1 :** రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియా గాంధీ వచ్చే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ఆరోగ్య సమస్యల కారణంగా సోనియా గాంధీ రాలేకపోవచ్చని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మే 28న ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి సోనియా గాంధీని వేడుకలకు రావాలని ఆహ్వానించారు. ఏఐసీసీ సోనియా గాంధీ ఆవిర్భావ వేడుకలకు హాజరవుతారని తెలిపింది. అంతలోనే వేడుకలకు సోనియా రావడం లేదంటూ కాంగ్రెస్ వర్గాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే రాష్ట్ర వేడుకలకు విద్యావేత్తలు, ఉద్యమకారులతో పాటు వివిధ వర్గాల వారికి ఆహ్వానం అందించారు. జూన్ 2న జరిగే ఆవిర్భావ వేడుకలకు ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ నేపథ్యంలోనే చార్మినార్, ట్యాంక్ బండ్, సచివాలయం, అమర జ్యోతి స్థూపం, గోల్కొండ తో పాటు వివిధ పర్యాటక ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమై భద్రతా ఏర్పాట్లను చేయగా.. సీఎస్ శాంత కుమారి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రభుత్వంతో పాటు బీఆర్ఎస్ కూడా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్ బండ్,సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీంతో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని.. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని అధికారులు సూచించారు.

# తెలంగాణ చిహ్నంలో చార్మినార్ తొలగించాల్సిందే

- మేం ఇందుకు ఎప్పుడూ పోరాడుతూనే ఉంటాం
- బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్

**న్యూఢిల్లీ, జూన్ 1:** రాష్ట్ర చిహ్నంలో చార్మినార్‌ను తొలగించాలని అప్పుడు, ఇప్పుడు తమ పార్టీ పోరాడుతునే ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంగనర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర చిహ్నంలో అమరవీరుల స్థూపం ఉండటం మంచిదని.. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి అభిప్రాయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ వేదికగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడు తూ... ఉద్యమంలో అసువులు బాసిన అమరులు, ఉద్యమకారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీని తెలంగాణ ఉత్సవాలకు ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులకు ఎందుకు ఆహ్వానం ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇచ్చిన మాట సోనియా వెనక్కి తీసుకోవడం వల్లే ఆత్మహత్యలు జరిగాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను వెతికి మరి ఆహ్వానం ఇచ్చి ప్రేమ ఒలకబోసిన రేవంత్‌కు , తెలంగాణకు మద్దతిచ్చిన బీజేపీని ఎందుకు వేడుకలకు పిలవడం లేదని నిలదీశారు. సోనియా, కేసీఆర్ ఒకే వేదిక పంచుకునేలా రేవంత్ ఎత్తుగడ వేశారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో బయటపడేందుకు కేసీఆర్, కాంగ్రెస్‌ను అన్ని రకాలా లోబరుచుకున్నారని ఆరోపించారు. ఈ కేసు విషయంలో కేసీఆర్‌కి ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో అధికారులు కేసీఆర్ పేరు చెప్పారని.. మరీ ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. కాళేశ్వరం కేసు, ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ఎందుకు చర్యలు తీసుకో వడం లేదని నిలదీశారు. అందుకే ఈ కేసుల దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్రం దర్యాప్తు చేస్తే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఎలా జరిగిందో చూశారని అన్నారు. ఏఐసీసీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందని విమర్శించారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాలను నిర్వీర్యం చేసిన మూర్ఖుడు కేసీఆర్ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో అందరి బతుకులను కేసీఆర్ నిర్వీర్యం చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అటకెక్కించే కుట్రలు

- సమగ్ర విచారణ జరగకుండా చేస్తున్నారు
- సరిగ్గా విచారణ జరిగితే కేసీఆర్, కేటీఆర్ జైలుకే
- విచారణ జరగకుండా ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు
- బండి సంజయ్ లేఖ తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్, ప్రజానావ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ లేఖ రాశారు. కాళేశ్వరం మాదిరిగానే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగకుండా అటకెక్కించే కుట్రలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపై విచారణ జరిగితే కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లక తప్పదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరగకుండా ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయని తెలిపారు. భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కారకులు కేసీఆర్, కేటీఆర్ లకు నోటీసులిచ్చి విచారిస్తే రాష్ట్ర దర్యాప్తు సంస్థల విశ్వసనీయత పెరిగేదన్నారు. ఆ పని చేయకపోవడంవల్లే సీబీఐ విచారణ కోరుతున్నామన్నారు. ఫోన్ ట్యాపింగ్ అత్యంత తీవ్రమైన నేరమన్నారు. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రసాదించిన హక్కులను కూడా ఫోన్ ట్యాపింగ్ తో కాలరాశారన్నారు. భార్యాభర్తలు మాట్లాడుకునే అంశాలను కూడా ట్యాపింగ్ చేసి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడ్డారన్నారు. ఫోన్ ట్యాపింగ్ తో వ్యాపారులు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు సహా పలువురు సెలబ్రిటీలను బెదిరించి డబ్బులు వసూలు చేయడంతోపాటు తమ అవసరాలను తీర్చుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుండి ప్రత్యేకంగా పరికరాలు తెప్పించారన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయాక ఫోన్ ట్యాపింగ్ పరికరాల ధ్వంసం పేరుతో దేశ భద్రతకు, ఉగ్రవాదులకు సంబంధించిన కీలకమైన సమాచార డేటాను కూడా ధ్వంసం చేశారన్నారు. వ్యాపార సంస్థలు ప్రతిపక్షాలకు విరాళాలు ఇవ్వకుండా ఫోన్ ట్యాపింగ్ ను వాడుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన సూత్రధారి ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నా ఎందుకు స్వదేశానికి రప్పించలేకపోయారన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలు నిగ్గు తేలాలంటే సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం అనివార్యం అన్నారు. మీరే సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాయండన్నారు. రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు నోటీసులిచ్చి విచారణ జరిపి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

# ముగిసిన మోడీ ధ్యానముద్ర

- తిరువళ్లూరు విగ్రహం వద్ద నివాళి
- ఢిల్లీకి తిరుగు ప్రయాణం

**కన్యాకుమారి, జూన్ 1 :** తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సుదీర్ఘ ధ్యానం ముగిసింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన ధ్యానం.. 45 గంటలపాటు కొనసాగింది. ఈ క్రమంలోనే ఉదయం సూర్యుడికి అర్ఘ్యం వదిలారు. ధ్యానం ముగిసిన అనంతరం ప్రముఖ తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ విగ్రహానికి మోదీ పూలమాల వేసి, నివాళులర్పించారు. వివేకానంద శిలాస్మారకం పక్కనే చిన్న దీవిపై ఏర్పాటుచేసిన 133 అడుగుల ఎత్తయిన ఈ భారీ విగ్రహం వద్దకు ఆయన పడవలో చేరుకున్నారు. అనంతరం కన్యాకుమారి తీరానికి తిరిగివచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు ముగిసిన వెంటనే పంజాబ్ నుంచి వెనుదిరిగిన మోదీ.. తమిళనాడులోని భగవతి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శిలాస్మారకాన్ని చేరుకుని, ధ్యాన పక్రియను ప్రారంభించారు. 131 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద కూడా ఇక్కడ ధ్యానం చేశారు. 2019లో ఎన్నికల సమయంలో మోదీ కేదార్‌నాథ్ వద్ద గుహల్లో ధ్యానం చేసిన విషయం తెలిసిందే.

# భయం లేదు..

## మళ్లీ బీజేపీదే అధికారం

- మోడీ ధ్యానంపై విపక్షాల విమర్శలు దారుణం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

**న్యూఢిల్లీ, జూన్ 1 :** ఈ నెల 4 వ తేదీన వెలువడే లోక్ సభ ఎన్నికల ఫలితాలపై ఆందోళన అవసరం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. దేశ ప్రజలందరూ ప్రధాని నరేంద్ర మోడీ వైపే ఉన్నారని చెప్పారు. ఇక, దేశంలో బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని జోస్యం చెప్పుకొచ్చారు. ఎన్డీయే 400 సీట్లకు పైగా గెలుస్తుందనే ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశానికి మోడీ అవసరముందని ప్రజలు గ్రహించారు.. అందుకే, మాకు ఈ సారి భారీ మేజార్టీ రాబోతుందన్నారు. చింద్వారా సీటుతో సహా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో అన్ని స్థానాలను గెలుస్తాం.. రాజస్థాన్‌లోనూ మెరుగైన ఫలితాలు వస్తాయని జేపీ నడ్డా వెల్లడించారు. కాగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ధ్యానంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలపై కూడా జేపీ నడ్డా స్పందించారు.. వారికి ఆధ్యాత్మిక విషయాలు పూర్తిగా తెలియవు.. వారు కేవలం పొలిటికల్ టూరిస్టులు మాత్రమేనంటూ మండిపడ్డారు. కేవలం ఎన్నికల టైంలోనే మతపరమైన పర్యటనలు చేస్తారంటూ నడ్డా ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎన్నికలను వర్గీకరించి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదిలోనే బీజేపీ అన్ని రికార్డులను బద్దలు కొడుతుందని విశ్వాసం మాకు ఉందన్నారు. తెలంగాణ. తమిళనాడులో ఓట్ల శాతం గణనీయం గా పెరిగింది.. ఇక్కడి ప్రజలు మోడీ నాయకత్వంలో కొత్త మార్పులను చూసేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పుకొచ్చారు.

# లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- కౌంటింగ్ కేంద్రాల దగ్గర సీసీ కెమారాలతో నిఘా
- కౌంటింగ్ కేంద్రాల వరకు నాలుగంచెల భద్రత
- ఎలక్ట్రానిక్ పరకరాలు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదు
- లెక్కింపు కోసం పదివేల మంది సిబ్బంది వినియోగం
- మీడియా సమావేశంలో వివరాలు తెలిపిన వికాస్ రాజ్

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌నకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర సీసీ కెమారాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలో 17 లోక్‌సభ నియోజకవర్గాలకు.. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి మే 13న ఎన్నికలు నిర్వహించగా... జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. జూన్ 4న ఉదయం 8 గంటల కు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ఏజంట్లకు సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత ఉంటుందని వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రంలో ఉండే ఏజెంట్లు, సిబ్బంది సెల్‌ఫోన్లు వినియోగించేందుకు అనుమతిలేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లవద్దని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి లెక్కింపు కేంద్రం వరకు పటిష్ఠ భద్రత ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రతి మూల కవర్ చేసేలా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర నాలుగంచల భద్రతతో పాటు 144 సెక్షన్ విధించినట్లు వికాస్‌రాజ్ తెలిపారు. ఉదయం 6 గంటలకు, ఏజెంట్లు ..ఉదయం 7 గంటలకల్లా తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ ? బ్యాలెట్ ను లెక్కించేందుకు 19 కౌంటింగ్ కేంద్రాలు,276 టేబుల్స్ ఏర్పాటు చేశారు. అలాగే 135 స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం తెలంగాణ వ్యాప్తంగా 34 కేంద్రాల్లో కౌంటింగ్ జరుగుతుంది. మూడు చోట్ల 24 రౌండ్లు ఉన్నాయన్నారు. యాకుత్‌పుర, చొప్పదండి, దేవరకొండలో 24 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవుతుందన్నారు. ఆర్మూర్ , భద్రాచలం, అశ్వారావుపేటలో 13 రౌండ్లు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 3 గంటలలోపు కౌంటింగ్ పూర్తిఅయ్యే అవకాశం ఉందని వికాస్‌రాజ్ తెలిపారు. సర్వీసు ఓటర్ల కోసం కేటాయించిన ఇటిపిబి ఓట్ల లెక్కింపు కూడా, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాల్లోనే నిర్వహిస్తారు. వీటికోసం వేరేగా టేబుళ్లను ఏర్పాటు చేశారు. వివి ప్యాట్ స్లిప్పుల లెక్కింపు కోసం ఇవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోనే ప్రత్యేక క్యాబిన్‌లను ఏర్పాటు చేశారు. ఫలితాలను ప్రకటించడానికి ప్రతీ లెక్కింపు కేంద్రంలో బోర్డులను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలవద్ద నాలుగంచెల భద్రతా వ్యవస్థను, బారికేడింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతీచోటా తనిఖీలు నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 276 టేబుళ్లు ప్రత్యేకంగా ఉంటాయన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు, 8.30 గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారం భం అవుతుందని తెలిపారు. మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధికంగా 24 రౌండ్లలో, అత్యల్పంగా 13 రౌండ్లలో లెక్కింపు ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో 2,400 మందికి పైగా మైక్రో అబ్జర్వర్లు ఉంటారని వికాస్‌రాజ్ తెలిపారు. ఓట్ల లెక్కింపులో దాదాపు 10వేల మంది సిబ్బంది పాల్గొంటారని వివరించారు.

# ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు


- ఏడు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్
- బెంగాల్‌లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు
- సీపీఎం, ఐఎస్‌ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ

**న్యూఢిల్లీ, జూన్ 1 :** లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ ముగిసింది. మొత్తం ఏడు విడతల్లో జరిగిన ఎన్నికలు.. శనివారం జరిగిన ఏడో దశ పోలింగ్‌తో ముగిశాయి. దీంతో అందరి చూపు జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌వైపు పడింది. ఏడో దశలో భాగంగా ఏడు రాష్ట్రాల్లోని 57 అసెంబ్లీ స్థానాలకు, ఒడిషాలోని 42 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరిగింది. చండీగఢ్‌తో పాటు పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని నాలుగు స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 13 స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లో 9, బీహార్‌లో 8, ఒడిశాలో 6, జార?ండ్‌లో మూడు స్థానాలకు శనివారం పోలింగ్ ముగిసింది. ఒడిశాలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు, హిమాచల్ ప్రదేశ్‌లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ఒకేసారి జరిగాయి. ఈ సాయంత్రం 5 గంటలకు, ఏడు రాష్ట్రాలు, చండీగఢ్‌లో 58.3% ఓటింగ్ నమోదైంది. బీహార్‌లో అత్యల్పంగా 35% కంటే ఎక్కువ ఓటింగ్ నమోదు కాగా, హిమాచల్ ప్రదేశ్‌లో అత్యధికంగా 48.6% నమోదైంది. లోక్ సభ తుది దశ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్ లోని పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. బెంగాల్ రాజధాని కోల్‌కతాకు దగ్గర్లోని జాదవ్ పూర్ లోక్ సభ నియోజకవర్గంలో సీపీఎం, ఐఎస్‌ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. సౌత్ 24 పరగణాల జిల్లాలో ఓ పోలింగ్ బూత్ లోకి చొరబడిన జనం.. ఈవీఎంతో పాటు ఎన్నికల సామగ్రిని ఎత్తుకెల్లి దగ్గర్ లోని నీటి కుంటలో పడేశారు. భాన్ గర్ నియోజకవర్గంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు, ఏఐఎస్‌ఎఫ్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. తృణముల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఏఐఎస్‌ఎఫ్ అభ్యర్థికి చెందిన వాహనాన్ని ధ్వంసం చేశారు. అటు ఇదే జిల్లాలోని జయ్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కుల్తాలీలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అల్లర్లు చెలరేగాయి. పోలింగ్ బూత్‌లోకి తమ ఏజెంట్లను అనుమతించట్లేదని ఓ పార్టీకి చెందిన కార్యకర్తలు పోలింగ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అంతటితో ఆగకుండా మూకుమ్మడిగా పోలింగ్ బూత్‌లోకి చొరబడ్డారు. అటు ఎన్నికల సామగ్రిని చెల్లాచెదురు చేసి ధ్వంసం చేశారు. ఓ ఈవీఎంతో పాటు వీవీప్యాట్ మెషిన్లను ఎత్తుకెళ్లారు. వాటిని దగ్గర్లోని ఓ నీటి కుంటలో పడేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. నీటిలో పడేసిన ఎన్నికల సామగ్రిని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను వెలికితీశారు. అయితే, ఈ ఘటనపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. కుల్తాలీలో ముందు జాగ్రత్త చర్యగా అదనంగా ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాట్లనే నీటి కుంటలో పడేశారని పేర్కొంది. కుల్తాలీ పోలింగ్ బూత్‌లో పోలింగ్ యథావిధిగా జరుగుతోందని స్పష్టం చేసింది. సెక్టార్ ఆఫీసర్ కు మరో ఈవీఎంను అందజేసినట్లు తెలిపింది. ఇక ఈ ఘటనపై కుల్తాలీ సెక్టార్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని ఈసీ స్పష్టం చేసింది. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారని పేర్కొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ బూత్ వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

# బెంగాల్లో అల్లరి మూకల ఆగడం

- పోలింగ్ కేంద్రంలో చొరబడి ఈవీఎంల అపహరణ
- చెరువులో విసరేసి పారిపోయిన దుండగులు

**కోల్‌కతా, జూన్ 1 :** లోక్‌సభ ఎన్నికల చివరి దశ పోలింగ్‌లో భాగంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో శనివారం పోలింగ్ జరుగుతోంది. బెంగాల్ జయనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓ అల్లరిమూక పోలింగ్ స్టేషన్‌లోకి చొరబడి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని చెరువులో విసిరేసిన ఘటనతో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుల్తాలీ గ్రామంలో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్థానికులకు, పోలింగ్ ఏజెంట్లకు మధ్య వివాదం చెలరేగింది. బేనిమాధవ్‌పూర్ ఎఫ్‌పి స్కూల్ బూత్‌లోకి ఏజెంట్లను రానీయకుండా కొంతమంది అడ్డుకోవడంతో కలకలం రేగింది. వీరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.



దీంతో ఆగ్రహించిన స్థానికులు బలవంతంగా పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశించారు. ఈవీఎంను బయటకు తీసుకెళ్లి చెరువులో పడేశారు.

# మళ్లీ మోడీకే ప్రజల పట్టం

(మొదటిపేజీ తరువాయి)




ఇకపోతే ఈ దఫా 400 సీట్లు అన్న బిజెపి కలలు మాత్రం నెరవేరేలా కనిపించడం లేదు. దేశం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి శనివారం సాయంత్రి వివిధ సంస్థలు తమ సర్వేలను ప్రకటించాయి. వివిధ సర్వే సంస్థలు, మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసాయి. వివిధ సర్వేలు ప్రజల అభిప్రాయాలను సేకరించి వాటన్నిటి ఆధారంగా దేశంలో ఎవరు అధికారంలోకి రానున్నారో అంచనా వేశాయి. ముచ్చటగా మూడో సారి కూడా ఎన్డీఏ కూటమి అధికారం చేపడుతుందని దాదాపు అన్ని సర్వేల ఫలితాలు చెబుతున్నాయి. ఎన్డీఏ కూటమి గరిష్టంగా 390 స్థానాల్లో గెలిచే అవకాశాలు ఉన్నాయి. రిపబ్లిక్ - పీమార్క్, ఇండియా న్యూస్ డీ వెల్లడించింది. డైనమిక్స్, రిపబ్లిక్ భారత్ మ్యాట్రిజ్ చేసిన సర్వేలు 300 పైగా స్థానాలు కమలం పార్టీ గెలుస్తుందని చెబుతున్నాయి. సుదీర్ఘంగా ఏడు దశల్లో సాగిన సార్వత్రిక ఎన్నికల సమరం తుది పోలింగ్ శనివారం ముగిసింది. దీంతో ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ మళ్లీ ఎన్డీయేనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఊహిస్తున్నాయి. వరుసగా మూడోసారి మోదీ ప్రధాని పదవిని అధిరోహిస్తారని చెబుతున్నాయి. రిపబ్లిక్-పీ మార్క్, ఇండియా న్యూస్- డీ డైనమిక్స్, రిపబ్లిక్ భారత్ మొదలైన సర్వే సంస్థలు ఎన్డీయే కూటమి 350కి పైగా స్థానాలు సంపాదిస్తుందని ప్రకటిం చాయి. రిపబ్లిక్ భారత్-పి మార్క్ అంచనా ప్రకారం ఎన్డీయే 359 సీట్లు, ఇండియా కూటమి 154, ఇతరులు 30 సీట్లు గెలుచుకుంటారు. రిపబ్లిక్-మాట్రెజ్ ప్రకారం.. ఎన్డీయే 353-368 సీట్లు, ఇండియా కూటమి 118, ఇతరులు 43-48 సీట్లు గెలుచు కుంటారు. ఇండియా న్యూస్-డి-డైనమిక్స్ అంచనా ప్రకారం.. ఎన్డీయే 371 సీట్లు, ఇండియా కూటమి 125 సీట్లు, ఇతరులు 47 సీట్లు గెలుచుకుంటారు. అలాగే జన్‌కీ బాత్ సర్వే కూడా ఎన్డీయేకే ఓటు వేసింది. ఆ సర్వే ప్రకారం.. ఎన్డీయే 362-392 సీట్లు, ఇండియా కూటమి 141-161 సీట్లు, ఇతరులు 10-20 సీట్లు గెలుచుకుంటారు. ఎన్డీటీవీ పోల్స్ ఆఫ్ పోల్స్ ప్రకారం ఎన్డీయే 365 సీట్లు, ఇండియా కూటమి 142 సీట్లు, ఇతరులు 36 సీట్లు గెలుచుకుంటా రు. టీవీ9 పోల్ స్ట్రాట్, పీపుల్స్ ఇన్‌సైట్ ఎగ్జిట్ పోల్స్ 2024 ఫలితాలను విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ స్థానాలకు సంబంధించి సంచలన సర్వే విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 25 పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన అంచనాలను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని 25 లోక్ సభ స్థానాలకు ఎన్డీయే కూటమికి 12 స్థానాలు స్తాయని అంచానా వేసింది. అందులో తెలుగుదేశం పార్టీకి 9 స్థానాలు కైవసం చేసుకోగా.. జనసేనకు 1, బీజేపీకు 2 స్థానాలు వస్తాయని పేర్కొంది. ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్‌ఆర్సీపీకి 13 స్థానాలు వస్తాయని తెలిపింది. తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 8 సీట్లు సాధిస్తుందని తెలిపింది. అలాగే బిజెపికి 7, బీఆర్‌ఎస్ 1, ఎంఐఎం 1 స్థానంలో విజయం సాధించను న్నట్లు తెలిపింది. ఆరా మస్తాన్ సర్వే ప్రకారం తెలంగా ణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 6 నుంచి 8 పార్లమెంట్ స్థానాలు వస్తాయన్నారు. ఇక బీజేపీకు 8 నుంచి 9 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకుంటుదని తెలిపింది. ఇతరులకు 1 స్థానం అని ప్రకటించింది. అందులో బీఆర్‌ఎస్, ఎంఐఎంలకు ఎవరికైనా రావొచ్చు అని బుతున్నారు. ఇదే ఆరా మస్తాన్ గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఖచ్చితమైన అంచనాలను వెలువరించారు.

# దక్షిణాదిలోనూ బీజేపీ సత్తా

- తమిళనాడులో గణనీయంగా సీట్ల పెంపు
- కేరళలో ఖాతా తెరవబోతున్నట్లు వెల్లడి
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ పెరగనున్న సీట్ల సంఖ్య
- కడపలో షర్మిల ఓటమి ఖాయమంటున్న సర్వేలు




**న్యూఢిల్లీ, జూన్ 1 :** లోక్‌సభ ఎన్నికల్లో విజయావకాశాలపై ఎగ్జిట్ పోల్ సర్వేలు క్రమంగా వెలువడు తున్నాయి. మెజారిటీ పోల్ సర్వేలు ఎన్డీయే 350కు పైగా సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నాయి. ఆసక్తికరంగా ఈసారి ఎన్నికల్లో దక్షిణాదిలోనూ కమలం పార్టీ 57 నుంచి 65 సీట్ల వరకూ గెలుచుకునే అవకాశాలున్నాయని ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. 'ఇండియా' కూటమి 59 నుంచి 66 సీట్లు, ఇతరులు 4 నుంచి 7 సీట్లు గెలుచుకుంటాయని పేర్కొంది.ఆంధ్రప్రదేశ్‌లో 25 సీట్లుకు గాను టీడీపీ 13 నుంచి 15 సీట్లు, బీజేపీ 4-6 సీట్లు, జనసేన పార్టీ 2 సీట్లు, వైఎస్‌ఆర్‌సీపీ 3-5 సీట్లు గెలుకుంటుందని వెల్లడించింది. కాంగ్రెస్ ఖాతా కూడా తెరువదని తేలిపోయింది. దీనిని బట్ట కడపలో షర్మిల ఓటమి ఖాయమని తెలుస్తోంది.కర్ణాటక 28 సీట్లలో ఎన్డీయే 20 నుంచి 24 సీట్లు, బీజేపీ 18-22, జేడీఎస్ 1-3, కాంగ్రెస్ 4-8 సీట్లు గెలుచుకుంటాయి. తెలంగాణ 17 సీట్లలో బీజేపీ 8 నుంచి 10, కాంగ్రెస్ 6-8, బీఆర్ఎస్ సున్నా నుంచి ఒకటి, ఏఐఎంఐఎం 1 సీటు గెలుచుకుంటాయని అంచనా వేశారు. కేరళ 20 సీట్లకు గాను బీజేపీ 1 నుంచి 3 గెలుచుకుని ఖాతా తెరవబోతోంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ 13 నుంచి 15, ఎల్‌డీఎఫ్ 3 నుంచి 5 సీట్లు గెలుచుకుంటాయి. తమిళనాడు 39 సీట్లలో బీజేపీ 5 నుంచి 7, డీఎంకే 16-18, కాంగ్రెస్ 6-8, ఏఐఏడీఎంకే సున్నా నుంచి ఒకటి, ఇతరులు 8 నుంచి 10 సీట్లు గెలుచుకుంటారు. పుదుచ్చేరి బిజేపీకే దక్కుతుందని అంచనా వేశారు.

# ఏపీలో ఎన్‌డీఏ కూటమిదే అధికారం

- విపక్షానికి పరిమితం కానున్న వైకాపా
- తెలంగాణలో ఎంపి సీట్లను పెంచుకోనున్న కాంగ్రెస్




**హైదరాబాద్, ప్రజానావ:** సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. వివిధ మీడియా హౌస్‌లు, సర్వే సంస్థలు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటి ని క్రోడీకరించి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతోందో అంచనా వేశాయి. మే 13న జరిగిన ఎన్నికల్లో ఏపీలో ఇంతకుముందెన్నడూ నమోదు కాని విధంగా అత్యధికంగా 82.37శాతం పోలింగ్ నమోదైంది. భారీ పోలింగ్ తగినట్లుగానే ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డాయి. ఏపీలో తెదేపా, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించాయి. ఆంధప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 2,387 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 46 మంది పోటీలో ఉండగా.. అనకాపల్లి జిల్లా చోడవరం అసెంబ్లీ నుంచి అత్యల్పంగా ఆరుగురు పోటీ చేశారు. మంగళగిరిలో నారా లోకేశ్ సహా 40 మంది బరిలో ఉన్నారు. కుప్పం నుంచి చంద్రబాబు సహా 13 మంది, పిఠాపురం అసెంబ్లీ బరిలో పవన్ సహా 13 మంది పోటీలో నిలిచారు. పులివెందుల నియోజకవర్గంలో జగన్ సహా 27 మంది పోటీ చేశారు. తెలంగాణలో ఐదు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందో ఏబీపీ - సీ ఓటర్ వంద శాతం ఖచ్చితమైన అంచనాలను వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీ 64 అసెంబ్లీ సీట్లను సాధించబోతోందని బీఆర్‌ఎస్ పార్టీ 40 లోపు సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసింది. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లోనూ ఎగ్జిట్‌పోల్స్‌ను ఏబీపీ - సీ ఓటర్ నిర్వహించింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు భిన్నత్వం ఎక్కువగా కనిపిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వేర్వేరుగా జరగడం వల్ల ఓటింగ్ ప్రయారిటీ అంశాలు మారిపోయాయి. అందుకే ఫలితాల్లోనూ భిన్నత్వం కనిపిస్తోంది. తెలంగాణలో ఏబీపీ - సీఓటర్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ అంచనాల్లో మొదట ఓట్ షేర్‌ను పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఏపీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అత్యధికంగా 52.9 శాతం ఓట్లు సాధిస్తుందని ఏబీపీ న్యూస్ - సీ ఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. తర్వాత వైఎస్‌ఆర్‌సీపీకి 41.7 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. అలాగే వైఎస్ షర్మిలా రెడ్డి కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని కొంత మెరుపరిచారు. గత ఎన్నికల్లో ఒక్క శాతం కన్నా తక్కువే ఓట్లు వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ సారి మెరుగైన ఓట్లు సాధించబోతోంది. ఈ సారి 3.3 శాతం ఓట్లు వస్తాయని ఏబీపీ - సీఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. ఇతరులు 2.1 శాతం ఓట్లు సాధించే అవకాశాలు ఉన్నాయి. సీట్ల ప్రకారం చూస్తే.. 52.9 శాతం ఓట్లు సాధిస్తున్న ఎన్డీఏ కూటమి ఆటోమేటిక్ గా స్వీప్ చేయంగా కనిపిస్తోంది. మొత్తం ఇరవై ఐదు లోక్ సభ సీట్లలో 21 నుంచి 25 సీట్లు కూటమి పార్టీలు సాధించే అవకాశాలు ఉన్నాయి. వైఎస్‌ఆర్‌సీకి 0 నుంచి 4 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. అంటే వైఎస్‌ఆర్‌సీపీ ఖచ్చితంగా గెలిచే లోక్ సభ సీటు ఒక్కటి కూడా లేదని ఏబీపీ సీఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. ఎబీపీ - సీఓటర్ ఎగ్జిట్ పోల్ పూర్తిగా లోక్ సభ నియోజకవర్గాలకు సంబంధించినదే. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. లోక్‌సభ సీట్ల నిష్పత్తిలోనే కూటమి, వైఎస్‌ఆర్‌సీపీ గెలుచుకునే అవకాశాలు ఉంటాయని అంచనా వేసుకోవచ్చు.

# పిల్లల టాయ్స్.. లంచ్ బాక్సుల్లో డ్రగ్స్

(మొదటిపేజీ తరువాయి)

అహ్మదాబాద్‌లో చిన్నారుల బొమ్మలు, చాకెట్లు, లంచ్ బాక్సులు, క్యాండీ విటమిన్‌లలో దాచి ఉంచిన రూ. 1.15 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఒక స్మగ్లర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి సుమారు రూ.కోటికిపైగా విలువైన డ్రగ్స్‌ను కస్టమ్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్‌తోపాటు కస్టమ్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో చిన్నారుల ఆట బొమ్మలు, చాక్లెట్లు, లంచ్ బాక్సులు, క్యాండీ విటమిన్‌లల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.1.15 కోట్ల విలువైన డ్రగ్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ హాల్‌టిక్కెట్లు విడుదల

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా శనివారం హాల్‌టికె ట్లను విడుదల చేసింది. జూన్ 9న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట జరిగే ఈ పరీక్ష రాసే అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరించగా.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4.03 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. పరీక్ష రోజు ఉదయం 9గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థుల్ని అనుమతించనున్నారు. పది దాటితే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తామని.. ఆ తర్వాత ఎవరినీ లోపలికి అనుమతించేది లేదని అధికారులు స్పష్టంచేశారు.

# టీజీఎస్పీగా మారిన పోలీస్ శాఖలోగో

**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీని అధికారికంగా మార్చిన క్రమంలో.. ప్రభుత్వ నిర్ణయానికి తగ్గట్లుగా పోలీస్ శాఖలోనూ అధికారులు లోగోలను మారుస్తున్నారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు టీఎస్‌ఎస్పీగా ఉన్న లోగోను టీజీఎస్పీగా మార్చారు. టీజీఎస్పీ లోగో మార్పును అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. టీఎస్‌ఎస్‌పీ బెటాలియన్ల లోగోలు సైతం టీజీఎస్పీ బెటాలియన్లుగా మార్పులు చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి త గ్గట్లుగా త్వరలోనే పోలీస్ శాఖలోని మిగతా విభా గాల లోగోల్లోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయి.



# ప్రభుత్వ భూమి కబ్జా

- అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోండి
- భారత కమ్యూనిస్టు పార్టీ మండల నాయకుడు

**బెజ్జంకి, ప్రజానావ:** బెజ్జంకి మండల కేంద్రంలోని 643 సర్వే నంబర్‌లో కొంత ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మండల నాయకుడు సంగెం మధు కోరారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో కబ్జాకు గురైందని ఆరోపిస్తూ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మధు మాట్లాడుతూ 643 సర్వే నెంబర్‌కు సర్వేయర్‌తో హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని విన్నవించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, భవిష్యత్ అవసరాలకు పనికి వచ్చేలా ఉపయోగించాలని కోరారు. అంతేకాకుండా స్థానిక ఎంపీడీవో లేఅవుట్ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురికావడం బాధాకరమన్నారు. నిత్యం అదే దారిలో వచ్చేటు వంటి అధికారులు చూసి చూడనట్లు వదిలేయడంపై ఆంతర్యం ఏమిటో అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దొంతరవేణి మహేష్ బోనగిరి శ్రావణ్, కల్లూరు బాలమల్లు, రొడ్డ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ క్వారీలపై అలెర్ట్‌గా ఉండాలి

- యజమానులు నిబంధనలు అతిక్రమించకుండా చూడాలి
- గనులు, భూగర్భ శాఖ కార్యదర్శి, టీజీఎండీసీ ఎండీ ఆదేశం




**కరీంనగర్, ప్రజానావ:** జిల్లాలో గ్రానైట్ క్వారీల యజమానులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించకుండా ఎప్పటికప్పుడు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ కార్యదర్శి, టిజి ఎండీసీ ఎండీ సురేంద్రమోహన్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆయన గనులు, భూగర్భ శాఖకు సంబంధించి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రానైట్ క్వారీలు, సాండ్ టాక్స్, రెవెన్యూ, జరిమానాల వసూలు, వివిధ అంశాలను వివరంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేంద్రమోహన్ మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పు డు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. క్వారీల లీజులకు సంబంధించిను అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల ని పేర్కొన్నారు. లీజు గడువు ముగియకముందే ముందే నిర్వాహకులకు సమాచారం అందించి రెన్యువల్ చేయించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మన ఇసుక విధానం ద్వారా ఆన్లైన్లో ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వరమే సరఫరా చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసు కోవాలని పేర్కొన్నారు. అన్ని అంశాలను వివరంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఇసుక అక్రమంగా రవాణా చేయకుండా కఠినంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు సైతం నమోదు చేస్తున్నామని వివరించారు. ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నామని చెప్పారు. ఇసుక అవసరం ఉన్నవారు ఆన్లైన్లో బుక్ చేసుకుని తెప్పించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గనులు, భూగర్భ శాఖ వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్ రామాచారి, టీజీఎండిసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కిరాణా షాపుల్లో మద్యం, గుట్కా అమ్మకాలు

## నిద్రమత్తులో అధికార యంత్రాంగం



**గన్నేరువరం, ప్రజానావ:** మండలం వ్యాప్తంగా కిరాణా షాపుల్లో బెల్ట్ షాపులు హద్దు అదుపు లేకుండా మద్యం , గుట్కా విక్రయాలు జోరుగా కొనసాగిస్తున్నారు. బెల్టు షాపుల తో పాటు కిరాణా షాపులు , పాన్ డబ్బాల్లో కూడా ఉదయం నుంచి మొదలుకొని రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతుండడంతో బెల్టు షాపులలో మద్యం ఏరులై పారుతుంది బెల్ట్ షాపులలో మద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవలసిన ఎక్సైజ్ అధికారులు చూసి చూసినట్టుగా వివరిస్తున్నారు. ఆయా గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టు షాపులు కిరాణం దుకాణంలో మద్యం ,గుట్కా పాన్ మసాలాలు దర్శనమిస్తున్నా యి. ముఖ్యంగా పల్లెలలో గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారు జంగపల్లి గునుకుల కొండాపూర్ చీమలకుంటపల్లె ,హనుమాజ్ పల్లి ఎక్స్ రోడ్ మైలారం కాసింపేట గన్నేరువరం మాదాపూర్ కిరాణా షాపుల్లో, గుండ్ల పల్లి స్టేజి వద్ద పాన్ డబ్బాల్లో గుట్కా ప్యాకెట్లు జోరుగా అమ్ముతున్నారు. ఇదంతా అధికార కనుసైగలో నడుస్తున్నాయని వీటి మీద ఎందుకు దాడులు చేస్తలేరని మహిళలు వాపోతున్నారు ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులో తనిఖీలు నిర్వహిస్తలేరని మహిళలు అంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం గుట్కా తాబాక్ అంబర్ మీద ఉక్కు పాదం వేసిన మండలంలో వీటి మీద అధికారులు తనిఖీ చేసిన దాఖలాలు లేవు అని ప్రజలు అంటున్నారు. ఏది ఏమైనా సంబంధించిన అధికారులు.మండలంలోని పలు గ్రామాల్లోని బెల్టు, కిరాణా షాపుల్లో. తనిఖీ లు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఉచిత శిక్షణను పొడిగించండి

## ప్రభుత్వాన్ని కోరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

**కరీంనగర్, ప్రజానావ:** ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా ఇస్తున్న డీఎస్సీ-2024 శిక్షణను మరో నెల పొడిగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ధర్మపురి, జగిత్యాల, మానకొండూరు ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మేడిపల్లి సత్యం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం డిప్యూటీ సీఎంకు వినతి పత్రం అందజేశారు. గత నెల 31-05-2024న వరకు రెండు నెలల గడువు ముగియనుండగా, ఈ విషయంలో జగిత్యాల కరీంనగర్ జిల్లాల్లోని అనేక మంది ఎస్సీ నిరుద్యోగ యువకులు తనను సంప్రదించి, కోచింగ్ వ్యవధిని మరో నెల రోజులు పొడిగించేలా చూడమని అభ్యర్థించారని డిప్యూటీ సీఎం దృష్టికి తెచ్చారు. పెద్ద సంఖ్యలో ఎస్సీ ఉద్యోగ యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఉచిత కోచింగ్ వ్యవధిని మరో నెల రోజులు పొడిగించాలని కోరినట్టు చెప్పారు. దీనికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి, నెల రోజులపాటు ఉచిత శిక్షణ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పినట్టు విప్ తెలిపారు. యువత సమస్యలపై తక్షణమే స్పందించిన డిప్యూటీ సీఎంకు నిరుద్యోగ యువత పక్షాన ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అడ్లూరి, కవ్వంపల్లి, మేడిపల్లి సత్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# ఒడిషా టు మహారాష్ట్ర.. కరీంనగర్‌లో పట్టివేత

- కరీంనగర్ బైపాస్‌లో 70 కిలోల గంజాయి స్వాధీనం
- ఏపీకి చెందిన ఇద్దరు, మహారాష్ట్రకు చెందిన ఒకరు అరెస్ట్

**కరీంనగర్, ప్రజానావ:** కరీంనగర్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. శనివారం బైపాస్ వద్ద కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహిం చగా, కారు(ఏపీ 31 బీహెచ్ 2925)లో గంజాయి గుర్తించారు. అందులో ప్రయాణిస్తున్న విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన సెరకనం రామకృష్ణ, కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన దొడ్డి మణికంఠ, మహారాష్ట్రకు చెందిన ధర్మేంద్రకుమార్‌ను అదుపు లోకి తీసుకున్నారు. వారిని విచారించగా, ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 70 కిలోల గంజాయి, కారు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గంజాయి పట్టివేతకు కృషిచేసిన వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్, ఎస్సై స్వామితో పాటు సిబ్బందిని టౌన్ ఏసీపీ అభినందించారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**గన్నేరువరం, ప్రజానావ:** గాగిల్లాపూర్ గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ దీక్ష స్వాములు హనుమాన్ టెంపుల్ లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచామృత అభిషేకం, ఫలాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని అభిషేకించారు. స్వామి వారి చిత్రపటాన్ని ఊయల సేవతో స్వామివారిని స్మరించారు. అనంతరం దీ క్ష స్వాములు ఇరుములు ఎత్తుకొని జై భజరంగబలి, జై హను మాన్ అంటూ గుడి చుట్టూ ప్రదక్షిణ చేసిన భక్తులు అనం తరం ఆలయ పూజారి కాచం వెంకటేశం ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష స్వాములు మాల విరమణ చేశారు. భక్తుడు తీర్థ ప్రసాదం స్వీకరించారు. బెజ్జంకి జీపీ వద్ద గల హనుమాన్ దేవాలయంలో పూజలు చేసి అన్నదానం చేశారు.





# బాసరలో ప్రవేశాలు ప్రారంభం

## మైనార్టీ జిల్లా అధ్య క్షుడు ఎండీ యాకూబ్ పాషా

**కొత్తగూడెం, ప్రజానావ:** నిర్మల్ జిల్లా బాసరలోని "రాజీవ్ గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ టెక్నాలజీస్'లో మొదటి సంవత్సరం ఇంటిగ్రేటెడ్ బీటెక్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ప్రారంభమైనదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యేడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని చెప్పారు. ఈ కాలేజీలో కన్వీనర్ కోటాలో 1500, గ్లోబల్ (మేనేజ్ మెంట్ కోటాలో) 150 సీట్లు అందుబాటులో ఉంటాయని అన్నారు. మెరిట్, రిజర్వేషన్లను బట్టి సీట్లు కేటాయిస్తారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు రూ. 2 లక్షల ఆదాయ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్లు, పదో తరగతి మార్కుల జాబితా, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, తీసుకొని ఈ నెల 22 లోపు www.rgukt.ac.in వెబ్సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. పీహెచ్‌సీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, సీఏపీ (ఆర్మీ ఉద్యోగుల పిల్లలు) మాత్రం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని, దరఖాస్తుపై విద్యార్థి సంతకం చేసి, ఈ నెల 29లోపు పంపించాలని సూచిం చారు. వివరాలకు 8520860785, 7416305245, 7416058245ను సంప్రదించాలని సూచించారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకులకు తరలిరావాలి

**తిమ్మాపూర్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 8.30 గంటలకు ప్రజా భవన్ (మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో) కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే .కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అభిమానులు హాజరు కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.




**కాంతులీనుతున్న కలెక్టరేట్...**

**కరీంనగర్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా విద్యుత్ దీపాలతో కరీంనగర్ కలెక్టరేట్ ను అలంకరించారు. వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ఇల్లంతకుంట, ప్రజానావ:** ఫుడ్ కమిషన్ సభ్యుడు వొరిగంటి ఆనంద్ అత్తమ్మ ఎర్రవెల్లి ఎస్తారమ్మ ఇటీవల మృతి చెందారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ఆమె కుటుంబాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ అరేపల్లి మోహన్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి రమణా రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, తడకపల్లి భూమయ్య, మైనార్టీ సెల్ నాయకులు జమాల్, గుండ్రెడ్డి రాజు, నవీన్ రెడ్డి, మామిడి నరేష్ , కీసరి కనకయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షునిగా రాజ్ కుమార్

**బెజ్జంకి, ప్రజానావ:** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం బెజ్జంకి పట్టణ అధ్యక్షునిగా కొత్త బోనగిరి రాజ్ కుమార్ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాడిచెట్టు భూమయ్య తెలిపారు. శనివారం బెజ్జంకి లో నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న రాజ్‌కుమార్‌కు బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాంకాలి శివరాజు,ప్రధాన కార్యదర్శి బోనగిరి రాజయ్య, కార్యదర్శి, రూపేష్, కోశాధికారి లింగాల శంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# హార్వెస్టర్- కారు ఢీ..

## ముగ్గురికి గాయాలు

**బెజ్జంకి, ప్రజానావ:** మండలంలోని తోటపల్లి స్టేజి వద్దగల రాజీవ్ రహదారి పైన శనివారం జరిగిన రోడ్ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయలైనట్లు ఎసై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాదు నుండి కరీంనగర్ వైపు సునీల్ కుమార్ తన భార్య వనిత, కుమారుడు వేదాన్స్‌తో కలిసి ఫోర్డ్ కార్ కార్లో వస్తున్నాడు. తోటపల్లి గ్రామంలో నుండి వస్తున్న హార్వెస్టర్ సైడ్ రాజీవ్ రహదారి పైనకు వస్తూ కార్ ను ఢీకొనగా కారులో గల ముగ్గురికి స్వల్ప గాయాలు అయినవి. కారు ఎడమవైపు పూర్తిగా డ్యామేజ్ అయినది. ఈఘటనలో హార్వెస్టర్ను నడిపిస్తున్న డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# చికెన్ వండలేదని.. భర్త ఆత్మహత్య

**బెజ్జంకి, ప్రజానావ:** భార్య చికెన్ వండలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోతారంలో చోటు చేసుకుంది.. అదిలాబాద్ జిల్లాకు చెందిన కరనే దశరథ(40), అతని భార్య సంగోలి, ముగ్గురు పిల్లలతో కలిసి మూడు సంవత్సరాల క్రితం పోతారం గ్రామ శివారులో గల ఓ కోళ్ల ఫారంలో పనిచేయుటకు వచ్చినారు. 30వ తేదీన దశరథం ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రికి తీసుకొని వచ్చినారు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత తనకు చికెన్ వండి ఇవ్వమని భార్యతో గొడవపడగా



భార్య డాక్టర్ తినవద్దు అన్నాడు అనడంతో గొడవ మొదలై అదే రోజు దశరథం గుర్తుతెలియని పురుగుల మందు తాగినాడు. దాంతో అతడిని కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శనివారం మరణించడు. భార్య ఫిర్యాదు మే-రకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ



# నకిలీ విత్తనాలు అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు

- సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**సిరిసిల్ల, ప్రజానావ :** నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీల చేస్తున్నామని, ఇందులో భాగంగా శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిరిసిల్ల పట్టణం పెద్ద బజార్ లోని విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి విత్తనాలు అమ్ముతున్నారు. బిల్ రసీదులను, విత్తన సంచులను పరిశీలించి పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలు కలిగి ఉన్నా, అమ్మిన వ్యక్తులపై పీడీ యాక్ట్ చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. రాబోయే నెల రోజులు చాలా కీలకమని జిల్లాలో ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులపై ఉంటుందన్నారు. జిల్లాలోని ఫర్టిలైజర్, సీడ్స్ షాపులపై నిఘా ఉంచి నకిలీ విత్తనాల విక్రయాలు, రవాణాను అరికట్టడం జరుగుతుందన్నారు. రైతులు సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్ నుంచి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుల మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే డయల్ 100 కి లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఆయన వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ రఘుపతి ఉన్నారు.



బీఆర్ఎస్ పార్టీ శనివారం గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్ బండ్ అమర జ్యోతివరకునిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు అమరులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. – ఖైరతాబాద్, ప్రజానావ



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాజన్న ఆలయ విమాన గోపురానికి విద్యుత్ దీపాలకరణ చేసి మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. – వేములవాడ, ప్రజానావ

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్

**మల్యాల, ప్రజానావ:** హనుమాన్ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.



**లింగంపల్లిలో..**

వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో పెద్ద హనుమాన్ జయంతిని పునస్కరించుకొని శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ శ్రీ భక్త ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భక్త ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఆ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. హనుమాన్ దేవాలయాలు లేని గ్రామాలు లేవని.. ఆ స్వామి వారు గ్రామస్తులకు ఎలాంటి కీడు జరగకుండా గ్రామానికి ధైర్యాన్ని కల్పిస్తారు పేర్కొన్నారు.



**వేములవాడ పట్టణం ఉప్పుగడ్డ వీధిలో..**

పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో గల భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్ పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్ ఇప్పపుల అజయ్, నాయకులు చిలక రమేశ్, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, దైతా కుమార్, సగ్గు పద్మ, వస్తాదు కృష్ణ, కూర దేవయ్య, అంబటి చందు, కోయల్ కార్ మస్తాన్ తదితరులున్నారు.

## 3 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

### సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**సిరిసిల్ల, ప్రజానావ:** ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్‌లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. ఆయా పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 120 విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షలు ఈ నెల 3 వ తేదీన మొదలై 11వ తేదీ దాకా కొనసాగనున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మంచినీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా చూడాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే సరిచూసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సెస్అధికారులు విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలకు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.



ప్రిన్సిపాల్ సెక్రెటరీ మైన్స్, శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ సురేంద్ర మోహన్ శనివారం కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ రామకృష్ణ శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఏఈఓ ప్రతాప నవీన్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకుడు అలీ శంకర్, సంకపల్లి పవన్, సీసీ ఎడ్ల శివసాయి ఉన్నారు. – వేములవాడ, ప్రజానావ

# నేటి నుంచి అంగన్వాడీలు పునః ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా 587 అంగన్వాడీ కేంద్రాలు
- సిరిసిల్ల జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి అంగన్వాడీలో పునః ప్రారంభం అయ్యాయని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మి రాజం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే ఒకటో తారీకు నుంచి మే 31 వరకు అంగన్వాడీ కేంద్రాల్లో ఒక పూట బడి నిర్వహిస్తూ ఆయాకు 15 రోజులు, టీచర్‌కు 15 రోజులు చొప్పున సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా సెక్టార్ మీటింగులు నిర్వహించడం జరిగిందని, ఇందులో భాగంగా శనివారం చెక్కపల్లి సెక్టర్ లో అంగన్వాడీ టీచర్లకి ఓరియంటేషన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ బడిబాట, కుటుంబ సర్వే, పెరుగుదల పర్యవేక్షణ, పూర్వ ప్రాథమిక విద్య, పాలు, గుడ్లు, బియ్యం, పప్పు, నూనె, పోపు దినుసులు, కురుకురే, బాలామృతం నిల్వలను పరిశీలించినట్లు చెప్పారు. అలాగే తంగళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో స్థానిక వైద్యాధికారి దీప్తి పాల్గొని మహిళలకు సంబంధించి గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు. జీవనశైలి వ్యాధులు బీపీ, షుగర్ వంటివి ఏ విధంగా నియంత్రించుకోవాలి.. మంచి



ఆహార పదార్థాలు ఏ విధంగా తీసుకోవాలి అనే విషయం గురించి కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బేటీ బచావో.. బేటీ పడావోలో భాగంగా ఆడపిల్లల నిష్పత్తి పెంచడానికి, సంస్థాగత డెలివరీలు పెంచడానికి త్రైమాసిక పరీక్షలు చేయించుకోవడం గురించి అవగాహన కల్పించారు. చెక్కపల్లిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, సిరిసిల్ల ప్రాజెక్టులోని తంగళ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ అలేఖ్య, మెడికల్ ఆఫీసర్ దీప్తి, సూపర్‌వైజర్ సుస్మిత, డీహబ్ కోఆర్డినేటర్ రోజా, జండర్ స్పెషలిస్ట్ దేవిక తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

### ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

**సిరిసిల్ల, ప్రజానావ:** అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్న జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మందాటి శ్రీశైలం ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా మార్చి 30 నుంచి నుంచి విధులకు హాజరు కావడం లేదు. నిబంధన ప్రకారం మందాటి శ్రీశైలం పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.

## పోలీసుల విధులకు ఆటంకం

### వ్యక్తి అరెస్టు, రిమాండ్

**చందుర్తి, ప్రజానావ:** చందుర్తి మండలం మరిగడ గ్రామానికి చెందిన కత్తి చంద్రయ్య (50) అనే వ్యక్తి ఏప్రిల్ 30న సాయంత్రం మరిగడ్డ గ్రామంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. ఈ కేసులో చంద్రయ్యను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పెట్రోలింగ్ కానిస్టేబుల్ భాస్కర్, హోంగార్డు శ్రీను మరిగడ్డలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా చంద్రయ్య పోలీసుల ట్యాట్ తీసుకొని విధులకు ఆటంకం కలిగించినట్లు ఎస్సై వివరించారు.

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సర్వం సన్నద్ధం

### ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో ఆదివారం నిర్వహించబోయే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను






అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది అందరూ వేడుకలకు హాజరు కావాలని అన్నారు. వేడుకలు సజావుగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట పరిపాలన అధికారి రాంరెడ్డి, పర్యవేక్షకులు వేణు, తదితరులున్నారు.



## చెక్కపల్లి జట్టు విజయం

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో లయ క్లబ్ వారి 30 వార్షికోత్సవం పునస్కరించుకొని గత రెండు రోజులుగా నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా గ్రామీణ స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్ శనివారం ముగిసింది. చివరి రోజు ఫైనల్‌లో చెక్కపల్లి జట్టు నూకలమర్రి జట్టుపై విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేతలకు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు కుంగిపోకుండా మరింత పుంజుకొని రానున్న రోజుల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.



# ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా మనమే

## ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుందన్న కృతిశెట్టి

శర్వానంద్, కృతి శెట్టి జంటగా వస్తున్న సినిమా 'మనమే' జూన్ 7న విడుదలవుతోంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు, నిర్మాత టిజి విశ్వప్రసాద్. ఈ నేపథ్యంలో కథానాయకురాలు కృతి శెట్టి మూవీ విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు. ఇందులో నా క్యారెక్టర్ పేరు సుభద్ర. ఇప్పటి వరకూ నేను చేసిన క్యారెక్టర్స్ కి డిఫరెంట్ గా వుంటుంది. నాకు చాలా కొత్తగా వుంటుంది. ఇప్పటివరకూ క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేశాను. కానీ ఈ క్యారెక్టర్ చాలా స్ట్రిక్ట్ గా వుంటుంది. షూటింగ్ సమయంలో డైరెక్టర్ శ్రీరామ్ గారిని ఇంత స్ట్రిక్ట్ గా వుంటుందా?! అని చాలా సార్లు అడిగాను. ఆయన అంత స్ట్రిక్ట్ గా కావాలని చెప్పారు. ఆయన విజన్ని ఫాలో అయ్యాను. పర్శనల్ గా నాకు పెద్ద కోపం రాదు. పెద్దగా అరవను. చాలా కామ్ గా వుంటాను. సుభద్ర క్యారెక్టర్ నాకు పూర్తిగా కొత్త. శర్వానంద్ గారు వన్ అఫ్ ది బెస్ట్ పెర్ఫార్మర్. నిన్న సినిమా చూశాను. ఆయన ప్రతి సీన్ లో అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ఆయన ఎక్స్ పీరియన్స్ కనిపించింది. ఇందులో నాకు ఓ ఫేవరట్ సీన్ వుంది. ఆ సీన్ కోసం చాలా వెయిట్ చేశాను. ఎలా చేయాలో అని చాలా అలోచించాను. కానీ శర్వానంద్ గారు చాలా కాజ్యువల్ గా వచ్చి ఆ సీన్ ని ఒక్క నిమిషంలో అద్భుతంగా ఫినిష్ చేశారు. నేను స్టన్ అయిపోయాను. శర్వానంద్ గారు పెర్ఫార్మెన్స్ ని మ్యాచ్ చేయడం చాలా కష్టం. తనతో వర్క్ చేయడం చాలా ఆనందంగా వుంటుంది. అందులో ఒక బేబీ కూడా వుంది. బేబీ తో షూట్ చేయడం అంత ఈజీ కాదు. అయితే శర్వానంద్ గారు చాలా బ్యూటీఫుల్ గా హ్యాండిల్ చేశారు. 'మనమే' స్ట్రాంగ్ ఎమోషన్ కనెక్ట్ వున్న ఎంటర్ టైనింగ్ ఫిల్మ్. ఇందులో వండర్ ఫుల్ కిడ్, పేరెంట్ ఎమోషన్ వుంది. అది గ్లోబల్ ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా మా ముగ్గురి క్యారెక్టర్స్ చుట్టూ వుంటుంది. అందుకే మనమే అనే పేరు పెట్టాం. ఇది పెర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రతి సీన్ లో ఎంటర్ టైన్మెంట్ వుంటుంది.సక్సెస్ ఫెయిల్యూర్ మన చేతిలో వుండదు. మన చేతిలో లేని విషయాలు గురించి ఎక్కువగా ఆందోళన చెందకూడదని ఈ ప్రయాణంలో నేర్చుకున్నాను. నాకు ప్రిన్సెస్ క్యారెక్టర్స్ చేయడం ఇష్టం. 'బాహుబలి' లో అనుష్క గారి లాంటి క్యారెక్టర్స్. అలాగే యాక్షన్ , మార్షల్ ఆర్ట్స్ బ్యాక్ డ్రాప్ వున్న రోల్స్ చేయాలని వుంది.మూడు తమిళ్ ఫిలిమ్స్ చేస్తున్నాను. అలాగే టోవినో థామస్ తో ఒక మలయాళం ఫిల్మ్ చేస్తున్నాను అని వివరించారు.

### టొబాకో యాడ్‌లో నటించేందుకు

# పుష్ప నిరాకరణ

### పదికోట్లు ఇస్తామని చెప్పినా నో అన్న బన్నీ



'పుష్ప'తో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అల్లు అర్జున్ పొగాకు కంపెనీల ఉత్పత్తుల్లో నటించేందుకు నిరాకరించారు. ఓ యాడ్‌లో నటిస్తే పదికోట్లు ఇస్తామన్న ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. ఇలా పొగాకు ఉత్పత్తులకు సంబంధించి తన దగ్గరకు వచ్చిన ఓ ప్రకటనను మరో ఆలోచన లేకుండా తిరస్కరించారు. అభిమానులను తప్పుదోవ పట్టించి, వారి ఆరోగ్యానికి నష్టం కలిగేలా ఎప్పుడూ ప్రవర్తించనని స్పష్టం చేశారు. కేవలం నటన మాత్రమే కాదు, సామాజిక బాధ్యతల విషయంలో అల్లు అర్జున్ ముందుంటారు. ఇప్పటికే మొక్కలు నాటే కార్యక్రమానికి తనవంతు ప్రచారం చేస్తూ, అభిమానులను సైతం ప్రోత్సహిస్తున్నారు. డబ్బు, పేరు ప్రఖ్యాతులు కన్నా కూడా అభిమానుల ప్రేమకే ఎక్కువ విలువ ఇస్తానని పలు వేదికలపైనా చెప్పారు. వరల్డ్ టుబాకో డే సందర్భంగా ఈ విషయం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా చక్కర్లు కొడుతోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప: ది రైజ్'. ఈ మూవీ విడుదలైన తర్వాత దేశవ్యాప్తంగా పుష్పరాజ్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఓ ప్రముఖ పొగాకు ఉత్పత్తుల సంస్థ బన్నిని కలిసింది. తమ ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఉండాలని కోరింది. ఈ ఆఫర్‌ను ఆయన నిర్మొహమాటంగా తిరస్కరించారట. ఈ యాడ్ చేస్తే రూ.10 కోట్ల వరకూ ఇస్తామని ఆఫర్ చేసినా, చేయనని స్పష్టంగా చెప్పారట. నేరుగా తీసుకోకపో యినా 'పుష్ప: ది రూల్'లో పుష్పరాజ్ ధూమపానం చేసే ప్రతి సీన్‌లోనూ బ్యాగ్రౌండ్‌లో తమ బ్రాండ్ లోగో కనిపించేలా చూడాలని కోరిందట. అందుకు కూడా బన్ని నో చెప్పారట. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పుష్ప2: ది రూల్' ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్, సునీల్, రావు రమేశ్, అనసూయ, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రంలోని పాటలు యువతను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# మిస్టర్ అండ్ మిసెస్ మహి

### ప్రేక్షకులకు కనెక్ట్ కాలేక పోయిన క్రికెట్ నేపథ్యం




స్పోర్ట్స్ డ్రామాలకి పెట్టింది పేరు బాలీవుడ్. హాకీ మొదలుకుని కుస్తీ వరకూ పలు రకాల క్రీడల్ని స్పృశిస్తూ సినిమాలు రూపొందుతుంటాయి. ఈ మధ్యే అజయ్ దేవగణ్ 'మైదాన్' వచ్చింది. ఇప్పుడు క్రికెట్ నేపథ్యంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. రాజ్ కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా నటించడం.. అగ్ర నిర్మాత కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ నుంచి వస్తుండడంతో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. మహేంద్ర (రాజ్ కుమార్ రావ్) ఓ ఫెయిల్యూర్ క్రికెటర్. మరో ఏడాది అవకాశమిస్తే తానేంటో నిరూపించుకుంటానని బతిమాలతాడు. అయినా తండ్రి వినిపించుకోకుండా తన స్పోర్ట్స్ షాప్ నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తాడు. మహిమ అగర్వాల్ (జాన్వీ కపూర్)తో పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తారు. తన ఫెయిల్యూర్ స్టోరీ చెప్పినప్పటికీ మహేంద్ర మనసు నచ్చి పెళ్లి చేసుకోవడానికి అంగీకారం తెలుపుతుంది మహిమ. వైద్యురాలైన ఆమెకీ క్రికెట్ అంటే పిచ్చి. అలా ఆ ఇద్దరి క్రికెట్ ప్రేమ వాళ్లని ఎక్కడిదాకా తీసుకెళ్లింది?విజయవంతమైన క్రికెటర్ కావాలనుకున్న మహేంద్ర కలలు ఎలా నెరవేరాయనేది మిగతా కథ. క్రీడా నేపథ్యంలో సాగే కథలన్నీ ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఫెయిల్యూర్స్‌తో అప్పటివరకూ అండర్‌డాగ్‌లా కనిపించిన హీరో... చివరికొచ్చేసరికి విజేతగా నిలిచి తన కలని నెరవేర్చుకుంటాడు. ఆ మధ్యలో నడిచే డ్రామా ఎంత వైవిధ్యంగా, ఎంత ఆసక్తికరంగా ఉందన్నదే సినిమా ఫలితాన్ని నిర్దేశిస్తురది. హీరోకి కోచ్ కావాలనే కోరిక కలగడం, హీరోయిన్ బ్యాట్ పట్టడంతోనే ఈ కథ ప్రయాణమేమిటో ప్రేక్షకుడికి అర్థమైపోతుంది. మధ్యలో డ్రామా కోసమని మైదానం నుంచి బయటికొచ్చి, భార్యాభర్తల మధ్య ఐడెంటిటీ గొడవని సృష్టించినా అదేమంత రక్తికట్టదు. మహిమ ఇంకా పూర్తిస్థాయి క్రికెటర్ కాకముందే, హీరో మహేంద్ర తన గుర్తింపు కోసం పాకులాట మొదలుపెట్టే సన్నివేశాలు కథకి అతకలేదు. చెప్పాల్సిన కథేమీ లేక ఇలా మరో దారిని ఎంచుకున్నట్టు అనిపిస్తుంది. హీరో, హీరోయిన్ల నేపథ్యం, పెళ్లి ప్రయాణం వరకూ సినిమా ఆకట్టుకుంటుంది. ఆ తర్వాత కథ సాదాసీదాగా మారిపోయింది. ప్రతీ సన్నివేశం ప్రేక్షకుడికి ఊహకు తగ్గట్టుగా సాగుతుంటుంది. ద్వితీయార్ధంలో అయితే హీరోకీ, ఆయన తల్లికీ మధ్య సాగే సన్నివేశాల్లో తప్ప ఎక్కడా మెరుపులు కనిపించవు. కథ, కథనాల కంటే జాన్వీకపూర్, రాజ్‌కుమార్ రావ్ జోడీ నటనే సినిమాని కొంతవరకు నిలబెట్టింది. సినిమాల్లో క్రికెట్ మ్యాచ్‌ని చూపిస్తున్నప్పుడు, ప్రేక్షకుడు నిజంగానే ఓ ఉత్కంఠ భరితమైన మ్యాచ్‌ని చూస్తున్న అనుభూతి కలిగేలా సన్నివేశాల్ని మలుస్తుంటారు దర్శకులు. కానీ, ఇందులో ఆ తరహా జాగ్రత్తలూ తీసుకోలేదు. హీరోయిన్ వెళ్లి వరుసగా సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ని గెలిపించేస్తుంది. రచనలోనే చాలా లోపాలు కనిపిస్తాయి. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. అనయ్ గోస్వామి కెమెరా పనితనం మెప్పిస్తుంది. పాటలు బాగున్నాయి. జాన్ స్టీవార్డ్ ఏడూరి నేపథ్య సంగీతం సినిమాపై ప్రభావం చూపించింది.

# అందరికీ నచ్చిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటించారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. భారీ అంచనాలతో మే 31వ తేదీన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకి అన్ని వర్గాల నుంచి విశేష స్పందన స్పందన వస్తోంది. కథా నేపథ్యం కొత్తగా ఉందని, ఎమోషనల్ సన్నివేశాలు కట్టిపడేశాయని ప్రేక్షకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించిన కథానాయకుడు విశ్వక్ సేన్, దర్శకుడు కృష్ణ చైతన్య తమ సంతోషాన్ని పంచుకున్నారు. తఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు థియేటర్లలో సినిమాలను ఆదరించడంలో ఎప్పుడూ ముందుంటారు. సినిమా చూసి నిజాయితీగా రివ్యూ ఇవ్వడంలో తప్పులేదు. కానీ కొందరు సినిమా చూడకుండానే రివ్యూ రాస్తున్నారు. మరికొందరైతే కావాలని నెగటివ్ రివ్యూలు రాస్తున్నారు. అలాంటి రివ్యూలను పట్టించుకోకుండా.. ఎందరో ప్రేక్షకులు సినిమాలు చూడటానికి ముందుకొస్తున్నారని అన్నారు. 'గామి', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఇలా విశ్వక్ సేన్ సినిమాల ఎంపిక వైవిధ్యంగా ఉందని ప్రశంసలు రావడం ఆనందంగా ఉందని, ఇక ముందు కూడా ఇలాగే ప్రేక్షకులకు కొత్తదనం ఉన్న సినిమాలను అందిస్తానన్నారు. సినిమాకి వస్తున్న స్పందనతో చాలా హ్యాపీగా ఉన్నామని త్వరలో సక్సెస్ మీట్ నిర్వహిస్తామన్నారు. దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన పట్ల చాలా సంతోషంగా ఉన్నామని. యువత యాక్షన్ సన్నివేశాలను, డైలాగ్స్ ని బాగా ఎంజాయ్ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని.. సెకండాఫ్ లో ఎమోషనల్ సన్నివేశాలు బాగా కనెక్ట్ అయ్యామని చెబుతుంటే హ్యాపీగా ఉందన్నారు. బాలకృష్ణగారు, వారి కుటుంబం సినిమా చాలా బాగుందని అభినందించడం.. మాటల్లో చెప్పలేని ఆనందాన్ని కలిగించిందని అన్నారు.





# జానా, కేకేలతో పొన్నం భేటీ

**ఉద్యమం నాటి సంగతులపై చర్చ**



**హైదరాబాద్, ప్రజానావ:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డితో పాటు కేశవరావుతో మంత్రి పొన్నం ప్రభాకర్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, మాజీ ఎంపీ రాజయ్య ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో నాటి పోరాటాలను జానారెడ్డి, కేశవరావుతో కలిసి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. ఉదయం, సాయంత్రం రెండు పూటలా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం పరేడ్ గ్రౌండ్ లో.. సాయంత్రం ట్యాంక్ బండ్ పై వేడుకలు జరగనున్నాయి. ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా సోనియా గాంధీ రానున్నారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మరో వైపు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.



# కొండగట్టులో హనుమజ్జయంతి

- రామనామస్మరణతో మార్మోగిన క్షేత్రం
- హనుమత్ భక్తుల రాకతో కిటకిటలాడిన ఆలయం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ యాస్మిన్ భాషా

**జగిత్యాల, ప్రజానావ:** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న ఆలయంలో హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆంజనేయస్వామి క్షేత్రం రామనామ జపంతో మారుమోగుతోంది. దీక్షా విరమణ చేసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కాషాయమయంగా మారిపోయాయి. పెద్ద హనుమాన్ జయంతి నేపథ్యంలో మాలదారులు, భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శుక్రవారం సాయంత్రం నుంచి హనుమాన్ మాలధారులు విరమణ కోసం క్షేత్రానికి వేల సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కూడా వేల సంఖ్యలో నిరీక్షిస్తూ ఉన్నారు. వారి భజనలతో క్షేత్రం శ్రీరామ నామస్మరణతో మారుమోగింది. జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషా రాత్రివేళ ఆలయానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం అంజన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఈ ఉత్సవాలు ప్రారంభం అయినప్పటి నుంచి భక్తులు దీక్ష విరమణ కోసం భారీగా తరలివచ్చారు. ఇప్పటికే ఆలయానికి చేరుకున్న వారు అంజన్నను దర్శించుకుని, దీక్షను విరమిస్తున్నారు. అధికార యంత్రాంగం అంతా ఇక్కడే ఉండి ఉత్సవాల నిర్వహణ చూస్తున్నారని, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్య నిర్వాహణపై దృష్టి పెడుతునట్లు పేర్కొన్నారు. కోనేరులో నీళ్లను ఎప్పటికప్పుడూ మార్చుతున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో 650 మంది పోలీసులతో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కొండపైకి చేరుకునేలా నాలుగు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం వరకు దీక్షాపరుల రద్దీ కొనసాగుందని అధికారులు తెలిపారు.

## రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా
# ట్రాఫిక్ నియంత్రణ

- ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ఆంక్షలు
- నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2 రాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నెకెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. పాత సైఫా బాద్ పోలీస్‌స్టేషన్ వైపునుంచి వచ్చేవాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపునుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపునకు పంపుతారు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపునుంచి వచ్చేవాహనాలను అంబేద్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్‌రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరాపార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్ హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు. సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్ర భారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి రద్దీని నివారించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

# మండుతున్న రోహిణి ఎండలు

- ఎండలకు తోడు వడగాలులు
- రుతు పవనాలతోనే ఉపశమనం



**కరీంనగర్, ప్రజానావ:** తెలంగాణలో రోహిణి కార్తె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సూర్యుడి భగభగలతో ఎండలు మండిపోతున్నాయి. గత నాలుగు రోజులుగా సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. వేసవి ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతవారణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నా యని, తమిళనాడు, కర్ణాటకల్లోకి ప్రవేశించినట్లు వాతావ రణ శాఖ తెలిపింది. శనివారం నల్గొండ, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారా బాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారా యణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఆదివారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముం దని వెల్లడించింది. ఇకపోతే రాష్ట్రంలోని 20 ప్రాంతాల్లో శుక్రవారం 46 డిగ్రీలకు పైబడి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజులు తీవ్రమైన ఎండలు ఉంటాయని వాతావరణశాఖ చెబుతుండంతో ప్రజలు వణికిపోతున్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల 45 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే గరిష్టంగా ఐదు డిగ్రీలు అత్యధికంగా నమోదవుతున్నాయి. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్‌లో శుక్రవారం 47.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. మంచిర్యాల జిల్లా భీమారంలో 47.1 డిగ్రీలు, నస్పూర్ 46.9, భద్రాద్రి కొత్తగుడెం జిల్లా గరిమెలపాడులో 46.9, నల్లగొండ జిల్లా కేతెపల్లిలో 46.8, ఖమ్మం జిల్లా ఖానాపూర్లో 46.8, కరెప్లలెలో 46.6, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.6, మంచిర్యాల జిల్లా హీజీపూర్ లో 46.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో శుక్రవారం సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మేర గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఖమ్మంలో అత్యధికంగా 45.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్టంగా నల్లగొండలో 25.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. 2024 వేసవి సీజన్లో అత్యంత వేడిమి రోజుగా మే 30వ తేదీ రికార్డు సృష్టించింది. మంచిర్యాల జిల్లా భీమారంలో గురువారం ఈ సీజన్లోనే అత్యధికంగా 47.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం నుంచి ఎండల తీవ్రత కాస్త తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల్లోపే నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఎండలకు వడదెబ్బకు గురై శుక్రవారం 13 మంది ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన పల్లకొండ ఐలయ్య (75), ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేటకు చెందిన డామెర రాంబాబు (50), నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన కర్రి రాజు (40), గుర్రంపోడుకు చెందిన రేపాక ముత్తమ్మ(64), మునుగోడు మండలం ఊకొండికి చెందిన కమ్మాలపల్లి మమత (30), వడదెబ్బకు గురై మరణించారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం హాజీపూరకు చెందిన కల్పన(24), పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ జాకీర్ హుస్సేన్(60), కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన కళ్యాణం రామక్క (75), పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు చెందిన ఈదునూరి కిషోర్(34), మంచిర్యాల జిల్లా కాసిపేటకు చెందిన దుర్గం భీమయ్య (55), ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని నాగోబా తండాకు చెందిన ఆత్రం లింబారావు(23) వేసవి ఉష్ణోగ్రతలకు తాళలేక వడదెబ్బకు గురై మృతి చెందారు.

# దేశంలో మారుతున్న రాజకీయాలు

- ఫలితాల్లో బీఆర్ఎస్‌కు సానుకూల ఫలితాలు
- మోడీపై ప్రజలకు తొలగిన భ్రమలు
- నిర్ణయాత్మక శక్తిగా మారనున్న కేసీఆర్
- ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి వెల్లడి



**నిజామాబాద్, ప్రజానావ:** బిజెపికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయం కేవలం కెసిఆర్‌తో సాధ్యమని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ముందే గుర్తించి కేంద్రంలో మోడీకి ప్రత్యామ్నాయం కావాలని కోరుకున్న మొదటి నాయకుడు కెసిఆర్ అని గుర్తు చేశారు. ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన తీసుకుని వచ్చిన మొదటి నేత కూడా కెసిఆర్ అన్నారు. నిజానికి ఆనాడు కెసిఆర్ ప్రతిపాదనపై ఓ అడుగు ముందుకు వేసివుంటే ఇవాళ ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. గతకొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచార సరళి, జాతీయ రాజకీయాల్లో వస్తున్న మార్పులు చూస్తుంటే కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కలీలక భూమిక పోషించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. ఈ విషయంలో కెసిఆర్ ఆలోచన చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాల తరవాత కేంద్రంలో జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని అన్నారు. కాంగ్రెస్, బిజెపిలు సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే స్థితిలో లేవని అన్నారు. బిఆర్ఎస్ జాతీయ రాజకీయాల్లో బాణంలా దూసుకుపోవడం ఖాయమని అన్నారు. సంకీర్ణ రాజకీయాల్లో ఏదైనా సాధ్యం అన్నారు. అయితే ప్రత్యామ్నాయ రాజకీయాలు కేవలం కెసిఆర్‌కు మాత్రమే సాధ్యమని వేముల అన్నారు. ఢిల్లీలో నిర్ణాయక శక్తిగా అవతరించడానికి కెసిఆర్‌కు మాత్రమే అవకాశం ఉందన్నారు. కెసిఆర్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ తరహా అభివృద్ధి చేయాలంటే బిఆర్ఎస్ పటిష్టంగా ముందుకు సాగాల్సి ఉందని అన్నారు. ఎన్నికల్లో అతధిక ఎంపి సీట్లను సాధిస్తామన్న విశ్వాసం ఉందని, అందుకే మళ్లీ కెసిఆర్ తన విశ్వరూపం చూపడం ఖాయమని అన్నారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్, బిజెపిల కాలం చెల్లిందని అన్నారు. జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు మోడీపై నమ్మకం పోయిందని, అలాగే కాంగ్రెస్‌ను మరోమారు ప్రజలు నమ్మే స్థితి లేదన్నారు. వివిధ పార్టీల్లో సత్తా కలిగిన నేత ఎవర్న చర్చ వచ్చినప్పుడు అంతా కెసిఆర్ వైపు చూస్తున్నారని అన్నారు. గతంలో తాము వివిధ పార్టీల నాయకులతో మాట్లాడినప్పుడు ఇదే భావన వ్యక్తం అయ్యిందన్నారు. దేశం పట్ల స్పష్టమైన అవగాహన కెసిఆర్‌కు ఉందన్నారు. 75 సంవత్సరాలు దేశాన్ని పాలించిన నాయకులు దేశ అభివృద్ధిని పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో రైతుల పక్షాన నిలబడి నిరుపేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. కెసిఆర్ జాతీయనేతగా ఎదిగితే సమస్యలను పరిష్కరిస్తూ దేశ ప్రగతిని మరింత పెంచవచ్చన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలకు చౌకీదార్, టేకేదార్ అవసరం లేదని ప్రజలకు మెరుగైన పాలన అందించే నాయకులు, ధృడ సంకల్పంతో ఉన్న సైనికుడు కావాలన్నారు. దేశ ప్రధాని మోదీకి ప్రజల సమస్యలపై ఎటువంటి అవగాహన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజల సొమ్ముతో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ వేలాది కోట్ల రూపాయాలు దోచుకున్నారని ఆరోపించారు. దేశావసరాలు, నదుల అనుసంధానం, రైతులు, వ్యవసాయ రంగంపై కెసిఆర్‌కు స్పష్టమైన అవగాహన ఉంది. అలాంటి కేసీఆర్ ప్రధానమంత్రి అయితే దేశ ప్రజలు అన్ని విధాలా లబ్దిపొందుతారని అన్నారు. అదే సమయంలో దేశంలోని అనేక ప్రాంతీయ పార్టీల నేతలు కేసీఆర్ ముందుచూపును స్వాగతించి ఉంటే ఇప్పటికే ఓ రాజకీయాల్లో ఓ మలుపు తిరిగేవని అన్నారు.

# గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని వేగంగా ఢీకొన్న స్కార్పియో
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

**గద్వాల, ప్రజానావ:** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున ఎర్రవల్ల చౌరస్తాలోని పెట్రోల్ పంపు వద్ద జాతీయ రహదారిపై కారు, లారీ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కర్నూలు దవాఖానకు తరలించారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారని చెప్పారు. అంతా ఒకే కుటుంబానికి చెందినవారని వెల్లడించారు. మృతులను వెంకటేశ్ (కారు డ్రైవర్), భార్య పుష్ప (35), తల్లి లత (55), వెంకటేశ్ చెలెలు కుమారుడు ఆదిత్య (6)గా గుర్తించారు. అతివేగం, నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలోని పెట్రోల్ పంపు దగ్గర జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వస్తున్న స్కార్పియో వాహనం లారీని ఢీ కొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# హైదరాబాద్ పరిధి ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో 16 కౌంటింగ్ కేంద్రాలు
- కౌంటింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు
- కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్లు 17 రౌండ్లలో లెక్కింపు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు
- నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

**హైదరాబాద్, ప్రజానావ:** లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ కోసం హైదరాబాద్ జిల్లా పరిధిలో అన్ని సిద్ధం చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ తెలిపారు. హైదరాబాద్, సికింద్రబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 16 కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని రొనాల్డ్ రాస్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో 20 టేబుళ్లు, యాకుత్‌పురాలో 24 రౌండ్లలో, చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఇక కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్లను 17 రౌండ్లలో లెక్కిస్తామని చెప్పారు. ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అబ్జర్వర్ ఉంటారని చెప్పారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్‌కోర్‌లో డేటా నమోదుచేస్తారన్నారు. కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని 8 గంటల కంటే ముందు పార్టీల ఎజెంట్ల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌లు ఓపెన్ చేస్తామని వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నాంపల్లి, సికింద్రాబాద్, ఉస్మానియా యూనివర్సిటీలలో ఏర్పాటు చేశామని అన్నారు. అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో 14 టేబుల్స్ ఉంటే జూబ్లీహిల్స్ లో మాత్రం 20 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. తొలిఫలితం చార్మినార్ వచ్చే అవకాశం ఉందని మధ్యాహ్నం మూడు గంటల వరకు పూర్తి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ కు 17 రౌండ్లు ఉంటాయని 12వందల మంది సిబ్బందిని కేవలం కౌంటింగ్ కు వాడుతున్నామని చెప్పారు. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌కు అబ్జర్వర్లు ఉంటారని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని రొనాల్డ్‌రాస్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోని 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుంది. 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుంది.




# గెలుపుతో ఆరంభం

## వామప్ మ్యాచ్‌లో టీమిండియా విజయం
## ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన రోహిత్ సేన



**న్యూయార్క్:** టీ20 ప్రపంచకప్ 2024 ప్రారంభానికి ముందు టీమిండియా అదిరిపోయే విజయాన్నందు కుంది. మెగా టోర్నీ నేపథ్యంలో బంగ్లాదేశ్‌తో శని వారం జరిగిన వామప్ మ్యాచ్‌లో సమష్టిగా రాణిం చిన టీమిండియా 60 పరుగుల తేడాతో గెలుపొం దింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసింది. రిషభ్ పంత్(32 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 53) విధ్వంసకర హాఫ్ సెంచరీ తో సత్తా చాటగా.. హార్దిక్ పాండ్యా(23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 40 నాటౌట్), సూర్యకుమార్ యాదవ్(18 బంతుల్లో 4 ఫోర్లతో 31) మెరుపులు మెరిపించారు. ఘోర రోడ్డు ప్రమాదంతో రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా జెర్సీని ధరించిన పంత్.. మునపటిలా స్వేచ్ఛగా చెలరేగా డు. ఈ సన్నాహక మ్యాచ్‌లో సంజూ శాంసన్(1), రోహిత్ శర్మ(23), శివమ్ దూబే(14) నిరాశపరి చారు. బంగ్లాదేశ్ బౌలర్లలో షోరిఫుల్ ఇస్లామ్, మహ్మదుల్లా, తన్వీర్ ఇస్లామ్ తలో వికెట్ తీసారు.

### రఫ్ఫాడించిన అర్ష్‌దీప్ సింగ్

అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 122 పరుగులే చేసి ఓటమిపాలైంది. అర్ష్‌దీప్ సింగ్(2/12), శివమ్ దూబే(2/10) నిప్పులు చెరగడంతో బంగ్లా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. మహ్మదుల్లా(28 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 40 రిటైర్డ్ ఔట్), షకీబ్ అల్ హసన్( 340 బంతుల్లో 2 ఫోర్లతో 28) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్(1/17), హార్దిక్ పాండ్యా(1/30), అక్షర్ పటేల్(1/10), జస్‌ప్రీత్ బుమ్రా(1/12) సత్తా చాటారు.

### చెలరేగిన భారత బౌలర్లు..


అర్ష్‌దీప్ సింగ్ వేసిన తొలి ఓవర్‌లోనే సౌమ్య సర్కార్(0) ఔటవ్వగా.. అతని మరుసటి ఓవర్‌లో లిటన్ దాస్(6) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ వెంటనే నజ్ముల్ హొస్సేన్ షాంటో(0)ను సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. దాంతో బంగ్లాదేశ్ 10 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఆచితూచి ఆడిన టన్‌జిద్ హసన్(17)ను హార్దిక్ పాండ్యా క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 41 పరుగులకే బంగ్లా 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో షకీబ్ అల్ హసన్, మహ్మదుల్లా జట్టును ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. షకీబ్ అల్ హసన్‌ను బుమ్రా ఔట్ చేయగా.. హాఫ్ సెంచరీకి చేరువైన మహ్మదల్లా రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. శివమ్ దూబే వేసిన ఆఖరి ఓవర్‌లో రిషద్ హొస్సేన్, జాకెర్ అలీ ఔటవ్వడంతో భారత విజయం లాంఛనమైంది.

### కోహ్లీ దూరం..

ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దూరంగా ఉన్నాడు. శనివారం ఉదయమే జట్టుతో కలిసిన విరాట్ కోహ్లీకి ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతినిచ్చామని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. కానీ విరాట్ కోహ్లీ మైదానానికి వచ్చి.. డగౌట్ నుంచి ఈ వామప్ మ్యాచ్‌ను వీక్షించాడు.

# మెగా క్రికెట్ సంగ్రామం

## నేటి నుంచే పొట్టి ప్రపంచకప్



**ప్రజానావ, స్పోర్ట్స్ డెస్క్:** వెస్టిండీస్, అమెరికాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న టీ20 ప్రపంచకప్‌నకు ఆదివారం తెరలేవనుంది. జూన్ రెండున ప్రారంభమయ్యే ఈ మెగా టోర్నీ జూన్ 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తోంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌తో సహా 20 జట్లు పోటీ పడుతున్నాయి. ఆదివారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో కెనడాతో ఆతిథ్య జట్టు అమెరికా తలపడనుంది. రెండో మ్యాచ్‌లో పపువా న్యూ గునియాతో మరో ఆతిథ్య టీమ్ వెస్టిండీస్ తలపడుతుంది. తొలి మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం ఆరు గంటల నుంచి రెండో మ్యాచ్ రాత్రి 8 గంటల నుంచి జరుగనుంది. కాగా ఈ టోర్నీలో 20 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి పోటీ పడనున్నాయి. ప్రపంచకప్‌లో పాల్గొంటున్న జట్లను ఎ,బి,సి,డి గ్రూపులుగా విభజించారు. ఎ గ్రూప్‌లో భారత్‌తో పాటు చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ ఐర్లాండ్, అమెరికా, కెనడా జట్లు ఉన్నాయి. గ్రూప్‌బిలో ఇంగ్లండ్, ఒమన్, స్కాట్లాండ్, ఆస్ట్రేలియా, నమీబియా, గ్రూప్‌సిలో ఆతిథ్య టీమ్ వెస్టిండీస్‌తో పాటు ఉగాండా, అఫ్ఘానిస్థాన్, పపువా న్యూ గునియా, న్యూజిలాండ్ జట్లు పోటీ పడనున్నాయి. గ్రూప్‌డిలో సౌతాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్ జట్లకు చోటు కల్పించారు. లీగ్ దశ మ్యాచ్‌లు జూన్ 17న ముగుస్తాయి. లీగ్ దశలో మొత్తం 40 మ్యాచ్‌లు ఉంటాయి. ప్రతి గ్రూప్ నుంచి రెండేసి జట్లు సూపర్8కు అర్హత సాధిస్తాయి. జూన్ 19 నుంచి సూపర్8 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో నుంచి నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. జూన్ 24తో సూపర్8 దశకు తెరపడుతుంది. ఇక తొలి సెమీ ఫైనల్ జూన్ 26న ట్రినిడాడ్‌లో రెండో సెమీస్ 27న గయానాలో జరుగుతుంది. మరోవైపు ఫైనల్ పోరు జూన్ 29న బ్రిడ్జ్‌టౌన్ (బార్బడాస్)లో జరుగనుంది. దాదాపు నెల రోజుల పాటు జరిగే మెగా టోర్నమెంట్ అభిమానులను కనువిందు చేయనుంది.

### ప్రత్యేక ఆకర్షణగా ఇండో-పాక్ మ్యాచ్


టీ20 వరల్డ్‌కప్‌లో మొత్తం 40 లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే వీటిలో చిరకాల ప్రత్యర్థులు భారత్‌పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. జూన్ 9న న్యూయార్క్ వేదికగా భారత్‌పాకిస్థాన్ జట్ల మధ్య పోరు జరుగనుంది. వరల్డ్‌కప్‌కే ఈ మ్యాచ్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ మ్యాచ్‌కు సంబంధించి టికెట్లకు ఇప్పటికే అమ్ముడై పోయాయి. ఈ లక్షలాది రూపాయలను వెచ్చించి అభిమానులు బ్లాక్‌లో టికెట్లను సొంతం చేసుకున్నారు. దీన్ని బట్టి ఈ మ్యాచ్‌కు ఉన్న ఆకర్షణ ఎలాంటిదో ఊహించుకోవచ్చు. మరోవైపు ఆస్ట్రేలియాఇంగ్లండ్, సౌతాఫ్రికా శ్రీలంక, వెస్టిండీస్‌న్యూజిలాండ్, అఫ్గాన్‌విండీస్, నమీబియాస్కాట్లాండ్, సౌతాఫ్రికాశ్రీలంక, బంగ్లాదేశ్ శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లకు కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

### హోరాహోరీ ఖాయం..

మరోవైపు మెగా టోర్నమెంట్‌లో అగ్రశ్రేణి జట్లు పాల్గొంటుండడంతో ఉత్కంఠభరితం పోటీలకు కొదవ ఉండక పోవచ్చు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వెస్టిండీస్, న్యూజిలాండ్, శ్రీలంక, సౌతాఫ్రికా, పాకిస్థాన్ జట్లు ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నాయి. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, ఆతిథ్య వెస్టిండీస్‌తో పాటు టీమిండియాకు ట్రోఫీ సాధించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఈ జట్లలో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఇక వరల్డ్‌కప్‌లో పాల్గొంటున్న పెద్ద జట్ల మధ్య ఈసారి హొరాహొరీ పోరు ఖాయంగా కనిపిస్తోంది. ఒక్క ఓవర్‌తో ఫలితం మారిపోయే టీ20 ఫార్మాట్‌లో చివరి బంతి వరకు ఏ జట్టు విజయం సాధిస్తుందో చెప్పడం సాధ్యం కాదు. సుదీర్ఘ రోజుల పాటు కొనసాగనున్న టీ20 వరల్డ్‌కప్ అభిమానులను కనువిందు చేయడం ఖాయం.

# రిబకినా, సబలెంక ముందుకు

- ప్రిక్వార్టర్ ఫైనల్‌లో మెద్వెదేవ్, అలెక్స్
- ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్



**పారిస్:** ప్రతిష్ఠాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణిలు అరినా సబలెంక (బెలారస్), ఎలినా రిబకి నా (కజకిస్థాన్) మూడో రౌండ్‌లో విజయం సాధించారు. పురుషుల సింగిల్స్‌లో ఐదో సీడ్ డానిల్ మెద్వెదేవ్ (రష్యా), 11వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా) నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. ఆసక్తికరంగా సాగిన మూడో రౌండ్‌లో మెద్వెదేవ్ 76, 75, 16, 64 తేడాతో టొమస్ మచక్ (చెక్) రిపబ్లిక్‌ను ఓడించాడు. మరో మ్యాచ్‌లో మినార్ 46, 64, 63, 63 తేడాతో జర్మనీకి చెందిన జాన్ లెనార్డ్ స్ట్రఫ్‌ను ఓడించాడు. తొలి సెట్‌లో ఓడిన అలెక్స్ తర్వాత వరుసగా మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో నాలుగో సీడ్ రిబకినా అలవోక విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఏకపక్షంగా సాగిన పోరులో రిబకినా 64, 62 తేడాతో ఎలిసె మెర్టెన్స్ (బెల్జియం)ను ఓడించింది. ఏ దశలోనూ మెర్టెన్స్ కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయింది. మరో పోటీలో సబలెంక 75, 61 తేడాతో స్పెయిన్‌కు చెందిన పౌలా బడోసాను ఓడించింది. తొలి సెట్‌లో సబలెంకకు ప్రత్యర్థి గట్టి పోటీ ఎదురైంది. అయితే టైబ్రేకర్ వరకు వెళ్లిన సెట్‌లో సబలెంక విజయం సాధించింది. ఇక రెండో సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన సబలెంక ఎలాంటి పోటీ లేకుండా మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.




# పవర్ లిఫ్టింగ్‌లో మెరిసిన సుకన్య

**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** అమెరికా వేదికగా జరిగిన మహిళల ఓపెన్ ప్రపం పవర్ లిఫ్టింగ్ (క్లాసిక్ బ్రెంచ్ ప్రెస్) ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ లిఫ్టర్ తేజావత్ సుకన్య అసాధారణ ప్రతిభతో దేశ ఖ్యాతిని ఇనుమడింప చేసింది. 76 కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుకన్య అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1200 మంది లిఫ్టర్లు ఈ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడ్డారు. కాగా 76 కిలోల విభాగంలో సుకన్య8వ స్థానంలో నిలిచి సంచలనం సృష్టించింది. అమెరికాలో అస్టిన్ నగరంలో ఈ పోటీలు జరిగాయి.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116